ప్రజాశక్తి

ఆదివారం 21 జులై 2024 8 పేజీలు





గుంటూరు పల్నాడు

ముంపుతో రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో గుంటూరు, పల్నాడు జిల్లాల్లో వర్షాలు కొనసాగుతున్నాయి. వర్షాలతో పలు ప్రాంతాల్లో పొలాలు ముంపునకు గురయ్యాయి. తుళ్లూరు మండలం పెదపరిమి వద్ద కోటేళ్ల వాగులోకి పెద్ద ఎత్తున వాన నీరు వచ్చి వాగు పై ఉన్న లో లెవెల్ చప్టా మీదుగా నీరు ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. మోతడక, పెదపరిమి - నీరుకొండ మధ్య వాగులు పొంగి రోడ్లు మీదుగా నీరు ప్రవహిస్తూ వెలగపూడి సచివాలయం, హైకోర్టుకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

డెల్టా ప్రాంతంలో వర్షాలకు వరి పైర్లునీట మునిగాయి. మొలకెత్తిన వరి నీట మునిగి కుళ్లిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గుంటూరు జిల్లాలో దాదాపు ఆరు వేల ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. తెనాలి, చేబ్రోలు, పొన్నూరు, దుగ్గిరాల, తాడేపల్లి, మంగళగిరి, కొల్లిపర తదితర మండలాల్లో ముంపు ప్రభావం ఎక్కువగా ఉంది. కాల్వలు, డ్రెయిన్లకు మరమ్మతులు లేకపోవడం వల్ల చాలా ప్రాంతాల్లో ఇబ్బందులు ఏర్పడ్డాయి. చేబ్రోలు మండలంలో తుంగభద్ర డ్రెయిన్‌లో మురుగునీరు ప్రవాహంతోపాటు కాల్వల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్కతో ముంపు సమస్యలు ఏర్పడుతున్నాయి. వేసవిలో చేయాల్సిన మరమ్మతులు వర్షాకాలంలో చేయడం వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండటం లేదు. జరగాల్సిన నష్టం ఏటా జరిగిపోతోంది.

మెట్ట ప్రాంతంలో అధిక వర్షాలు, ముసురు ప్రభావంతో పత్తిపంటకు తెగులు బెడద ఏర్పడింది. కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాలకు పులిచింతలకు నీటి ప్రవాహం ▶ 2లో

పల్నాడులో పత్తికి తెగుళ్ల బెడద - కొనసాగుతున్న ముసురు



తాడేపల్లి మండలంలో నీటమునిగిన పైర్లు

గుంటూరు జిల్లాకు కొత్తగా ఇద్దరు ఐఎఎస్‌లు

- జెసిగా భార్గవ్‌తేజ, గుంటూరు కమిషనర్‌గా దినేష్‌కుమార్
- ట్రాన్స్‌కో జెఎమ్‌డిగా చేకూరి కీర్తి బదిలీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



భార్గవ్‌తేజ, దినేష్‌కుమార్

రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఐఎఎస్ అధికారుల బదిలీల్లో భాగంగా జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఎ.భార్గవ తేజ నియమితులయ్యారు. కర్నూలు మునిసిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఆయన్ను గుంటూరు జెసిగా నియమించారు. గుంటూరు జెసిగా ఉన్న రాజకుమారి ఇటీవల ప్రమోషన్‌పై నంద్యాల జిల్లా కలెక్టరుగా వెళ్లడంతో గత వారం రోజులుగా ఈ పోస్టుఖాళీగా ఉంది. ఈ స్థానంలో భార్గవ తేజను నియమించారు. ఆయన కర్నూలులో అత్యంత సమర్ధవంతంగా పనిచేశారన్న పేరుంది. గుంటూరు మునిసిపల్ కమిషనర్‌గా రాజమండ్రి మునిసిపల్ కమిషనర్ కొత్తమాసు దినేష్‌కుమార్ నియమితులయ్యారు. ఇప్పటివరకు గుంటూరు కమిషనర్‌గా ఉన్న చేకూరి కీర్తి బదిలీ అయ్యారు. ఈమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. దినేష్‌కుమార్ 2020-21లో తెనాలి సబ్ కలెక్టరుగా పనిచేశారు. కరోనా సమయంలో ఆయన కీలక సేవలు అందించారు. రాజమండ్రి కమిషనర్‌గా అక్కడ అభివృద్ధిలో కీలక భూమిక పోషించారు. గుంటూరు కమిషనర్‌గా ఉన్న చేకూరి కీర్తిని బదిలీ చేసి ట్రాన్స్‌కో జాయింట్ డైరక్టర్‌గా నియమించారు.

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత జరుగుతున్న ఐఎఎస్, ఐపిఎస్ అధికారుల బదిలీల పరంపరలో భాగంగా దాదాపు రెండున్నర ఏళ్లుగా గుంటూరు కమిషనర్‌గా ▶ 2లో



నీట మునిగిన పొలాలను పరిశీలిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు తదితరులు

ముంపు బాధిత రైతులను ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

వర్షాలతో నీట మునిగిన పొలాలను సిపిఎం, రైతు సంఘాల నాయకులు శనివారం పరిశీలించారు. మండలంలోని తేలప్రోలు - అత్తోట మార్గంలో పొలాల వద్దకెళ్లు వెద్దపద్ధతిలో సాగైన వరిని, నీటిలో తేలుతున్న మొక్కలను పరిశీలించగా హయ్యర్‌పేట, అత్తోటకు చెందిన కౌలురైతులు పి.సుమంత్, ఎ.కొండలు తమ గోడును నాయకుల వద్ద వెళ్లబోసుకున్నారు. నష్టపోయిన తమకు ప్రభుత్వం ద్వారా పరిహారం ఇప్పించాలని కోరారు.

ఈ సందర్భంగా సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ వర్షం రైతులకు తీరని నష్టాన్ని మిగిల్చిందని, అత్యధికంగా సాగు చేస్తున్న కౌల్దార్లు తీవ్రంగా దెబ్బతిన్నారని అన్నారు. ఇప్పటికే ఎకరాలకు కౌలు కాకుండా రూ.8 వేల వరకూ పెట్టుబడి అయ్యిందని తెలిపారు. నీట మునిగి దెబ్బతిన్న పొలాలను అధికారులు పరిశీలించి ఎకరాకు రూ.10 వేల పరిహారాన్ని ఇప్పించాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఉచితంగా ఎరువులు, పురుగు మందులు పంపిణీ చేయాలన్నారు. అధికభాగం పంటలను కౌలురైతులే సాగు చేస్తున్నారని, వారికి భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు మంజూరు చేయడంతోపాటు పంట రుణాలు ఇవ్వాలన్నారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎం.శివసాంబిరెడ్డి మాట్లాడుతూ పంట కాల్వల్లో గుర్రపు డెక్క, తూటికాడ, పూడికను తొలిగించకపోవడం కారణంగా పొలాలకు ఈ పరిస్థితి వచ్చిందన్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఖరీఫ్ ఆరంభంలోనే రైతులు నష్టాన్ని చవిచూడాల్సి వచ్చిందని విమర్శించారు. డెల్టా పరివాహక ప్రాంతాల్లో నూటికి 80 శాతం ఎస్సీ, బీసీ, చిన్న,సన్నకారు రైతులు, కౌల్దార్లే ఉన్నారని, వీరంతా అధిక వడ్డీలకు అప్పులు చేసి పంటలు సాగు చేయడం వల్లే ధాన్యం పండుతోందని చెప్పారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 పెట్టుబడి సాయాన్ని సత్వరమే రైతులు, కౌలురైతులకు జమ ▶ 2లో

ఎన్‌సిఇఆర్‌టి సిలబస్‌పై సమగ్ర చర్చ జరపాలి : యుటిఎఫ్ 2పే

ముంపుతో రైతుల్లో ఆందోళన

(మొదటి పేజీ తరువాయి)

రావడం ప్రారంభమైంది. పట్టిసీమ నుంచి వస్తున్న నీటితో ప్రకాశం బ్యారేజికి కూడా వరద ప్రభావం కన్పిస్తుంది. ప్రకాశం బ్యారేజి నుంచి శనివారంరాత్రి 7 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. నాగార్జున సాగర్ ఆయకట్టు పరిధిలోకూడా వర్షాలు మెరుగుపడటంతో సేద్యం ఊపందుకుంది. ప్రధానంగా పత్తి సాగు పెరిగింది. వర్షాలకు రహదారులు చిన్నాభిన్నం అవుతున్నాయి. ఇప్పటికీ దెబ్బతిన్న రహదారులు వర్షాలకు మరింత దుర్భరంగా మారుతున్నాయి. వర్షాలు మరోరెండు రోజులు కొనసాగుతాయని చెబుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈనెలలో ఇప్పటికే నెల రోజులకు సరిపడా వర్షం కురిసిందని అధికారులు తెలిపారు. జులైలో 164.9 మిల్లీ మీటర్ల వర్షం కురవాల్సి ఉండగా ఇప్పటి వరకు 183.9 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

గుంటూరు జిల్లాకు కొత్తగా ఇద్దరు ఐఎఎస్‌లు

(మొదటి పేజీ తరువాయి)

పనిచేస్తున్న చేకూరి కీర్తి కూడా బదిలీ అయ్యారు. ఆమె ప్రజా ప్రతినిధులకు అందుబాటులో ఉండరని, వారి ఫోన్లు సైతం ఆన్సర్ చేయరనే అపవాదును మూటగట్టుకున్నారు. ప్రభుత్వం మారిన తరువాత టిడిపి ప్రజా ప్రతినిధులు కూడా ఆమె తీరుపై కొంత అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేల ఫోన్లకు కూడా ఆమె సరిగా స్పందించలేదనే విమర్శలు ఎదుర్కొన్నారు. మేయర్ కూడా తన ఫోన్‌కు స్పందించడం లేదని శుక్రవారం రాత్రి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు సమాచారం.రాజకీయ నాయకుల విషయంలో ఎలా ఉన్నా విధి నిర్వహణలో రాజీలేని ధోరణితో పనిచేసే కీర్తి చేకూరి వైసిపి నేతల అవినీతి అక్రమాలకు చాలా వరకు అడ్డుకట్ట వేయగలిగినా ఉన్నత స్థాయిలో గత ప్రభుత్వ పెద్దల వత్తిడితో కొన్ని పనులను అయిష్టంగానే కొనసాగించారు. మేయర్ కావటి మనోహర్ నాయుడికి, ఆమెకు మధ్య కూడా పాలనపరంగా అనేక అంశాల్లో విబేధాలు పొడచూపాయి. ఆమెకు వ్యతిరేకంగా కొంత వైసిపి నాయకులు టిడిపి వారితో కలిసి రాజకీయంగా పావులు కదిపారన్న విమర్శలూ లేకపోలేదు. విధి నిర్వహణలో నీతి నిజాయితీగా పనిచేసి అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అనేకమందిని సస్పెండ్ చేశారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించే వారిపై కఠిన చర్యలు తీసుకున్నారు. నగరంలో పారిశుధ్యం మెరుగుదల విషయంలో క్షేత్రస్థాయి నుంచి అనేక సంస్కరణలు అమలు చేయడం కొంతమంది వైసిపి ప్రజాప్రతినిధులకు, సంఘాల నాయకులకు మింగుడు పడలేదు.

సామాన్యులపై విద్యుత్ భారాలు తగ్గించాలి

ప్రజాశక్తి-తెనాలి : విద్యుత్ భారాలు తగ్గించాలని స్థానిక చెంచుపేట విద్యుత్ కార్యనిర్వాహక ఇంజినీర్ కార్యాలయంలో శనివారం జరిగిన విద్యుత్ వినియోగదారుల సమావేశంలో సిపిఎం తెనాలి ఏరియా కార్యదర్శి కెబాబూప్రసాద్ ఆధ్వర్యంలో అర్జీ ఇచ్చారు. ఈ సందర్భంగా బాబూప్రసాద్ మాట్లాడుతూ విద్యుత్ బిల్లుల డిమాండ్ నోటీస్‌లో ట్రూ అప్ చార్జెస్, ఇంధన సర్చార్జీలను వేయరాదని, 2019-20నాటి విద్యుత్ టారిఫ్‌ను అమలు చేయాలని, డిస్కంలు ఏపీ జెన్కో, ఏపీ ట్రాన్స్కో రుణాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రద్దు చేయాలని కోరారు. తుప్పు పట్టిన, కాలం చెల్లిన ఎర్త్ పిట్లను, ఎర్త్ కండక్టర్‌ను మార్చాలని, బ్రేక్డౌన్, విద్యుత్తు సరఫరాలో అంతరాయం తగ్గించేందుకు అవసరమైన ఐసోలేటర్స్ ఏర్పాటు చేయాలని కోరారు. ఆయిల్ లీకౌతున్న ట్రాన్స్ఫార్మర్ మార్చాలని, విద్యుత్ తీగలకు తగులుతున్న చెట్ల కొమ్మలు తొలగించాలన్నారు. అర్జీనిచ్చి వారిలో సిపిఎం సీనియర్ నాయకుడు షేక్ హుస్సేన్ వలి ఉన్నారు.

ఎంపీ విజయసాయిరెడ్డిపై ఫిర్యాదు

ప్రజాశక్తి-పెదనందిపాడు రూరల్ : జర్నలిస్టులపై రాజ్యసభ సభ్యులు విజయ సాయిరెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ శనివారం పెదనందిపాడు ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా జర్నలిస్టులు స్థానిక పాత బస్టాండ్ సెంటర్ నుండి నిరసన ర్యాలీ చేశారు. తహశీల్దార్ కార్యాలయం వదరకు వెళ్లి తహశీల్దార్ డి.లాజరస్‌కు ఫిర్యాదు చేశారు. నైతిక విలువలు కోల్పోయిన సాయిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిహెచ్.శ్రీనివాసరావు, డి.శ్రీనివాసరావు, కాంతారావు, శివయ్య, రాజు పాల్గొన్నారు.

ముంపు బాధిత రైతులను ఆదుకోవాలి : సిపిఎం

(మొదటి పేజీ తరువాయి)

చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం తెనాలి ఏరియ కార్యదర్శి కె.బాబూప్రసాద్ మాట్లాడుతూ నీటి పారుదల, వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి పంట నష్టం అంచనాలను రూపొందించాలన్నారు. ఇన్పుట్ సబ్సిడీ అందిస్తే రైతులు మళ్లీ పంటలు వేయడానికి వీలవుతుందని చెప్పారు. ప్రకటనలతో సరిపెట్టకుండా నిర్దిష్టమైన కార్యాచరణను ప్రభుత్వం ప్రకటించాలని కోరారు. పరిశీలనలో సిపిఎం నాయకులు షేక్ హుస్సేన్ వలి, రైతులు పాల్గొన్నారు.

పొలంలో నీరు బయటకు వెళ్లడం లేదు

ఎలివెల కొండలు, కౌలురైతు, అత్తోట, కొల్లిపర మండలం.



తేలప్రోలులో 35 ఎకరాలు కౌలుకు తీసుకుని బిపిటి 5204 రకం విత్తనాలను వెద పద్ధతిలో నాటాను. ఎకరాకు రూ.7 వేలు ఖర్చయింది. ఇదంతా అప్పు చేసి తెచ్చాను. ఇప్పుడు దాదాపు రూ.2.5 లక్షల నష్టం వచ్చింది. పైరును కాపాడుకోడానికి పొలాల్లో నీటిని బయటకు పంపాలని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. కాల్వల్లో నీరు పారక పొలంలోని నీరు బయటకు వెళ్లడం లేదు.

ప్రభుత్వమే ఆదుకోవాలి

వంపుగళ్ల సుమంత్, కౌలురైతు, హయ్యర్‌పేట, ఐతానగర్, తెనాలి.



33 ఎకరాలు కౌలుకు తీసుకుని బిపిటి 1800 రకం వేశాను. పొలంలో పదెకరాలు డబ్బు కౌలుకాగా, 23 ఎకరాలు వడ్ల కౌలుకు తీసుకున్నారు. ఎకరాకు రూ.8 వేలు పెట్టుబడి ఖర్చవగా ఇదంతా అప్పులు తెచ్చి పెట్టిందే. దుక్కి మొదలుకొని ఫౌండేషన్ సీడ్, ఎరువులు, పురుగు మందులు, వెద పద్ధతిలో నాట్లు వేసేవరకు యంత్రాలతోపాటు నా కుటుంబం మొత్తం కష్టపడ్డాం. తీరా ఇప్పుడు 33 ఎకరాల్లో సగం పైరు నీట మునిగింది. గతంలో జొన్న పంట కూడా నష్టపోయాను. గత ప్రభుత్వ హయాంలో తొమ్మిది సార్లు వర్షాలకు పంట దెబ్బతిని నష్టపోయారు. వ్యవసాయాన్నే నమ్ముకుని బతుకుతున్న మమ్మల్ని ప్రభుత్వమే ఆదుకోవాలి.



ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

గుండి మెడ, చిర్రావూరు గ్రామాల్లో నీట మునిగిన పొలాలను సిపిఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి డి.వెంకటరెడ్డి మాట్లాడుతూ గతంలో ఆంధ్రరత్న పంపింగ్ స్కీం పంట కాల్వ ద్వారా నీటిని విడుదల చేసినప్పుడు ఆయా గ్రామాల రైతులు వరి నాట్లు వేసుకునే వారన్నారు. ప్రస్తుతం పంట కాల్వ పాడైపోయి, నీరు విడుదల చేయకపోవడంతో వెదపద్ధతిలో రైతులు సాగు చేస్తున్నారని చెప్పారు. వర్షాలు కురిసినప్పుడు పొలాల్లో నీరు నిలిచి బయటికి పోయే దారి లేక వెద వరంతా దెబ్బతింటోందని చెప్పారు. ఈ పరిస్థితులతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నా





ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. కాల్వలను రైతులే సొంతంగా పూడిక తీయించుకుంటున్న నేపథ్యంలో వారి మధ్య మనస్పర్థలు వస్తున్నారని, ఈ సమస్యలకు పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం మండల వ్యవసాయాధికారిని కలిసి మాట్లాడారు. పరిశీలనలో సిపిఎం నాయకులు ఎన్.విజయరాజు, బి.సంసోను, రైతులు పాల్గొన్నారు.

పొర మునిగింది.. వరి పోయింది..

వల్లంశెట్టి కృష్ణ, కౌలురైతు, చిర్రావూరు.

కౌలుకు ఐదెకరాలు పొలం తీసుకుని నాలుగెకరాల్లో వరి, ఎకరంలో సొర సాగు చేశాను. వరి పైరంతా నీట మునిగి రూ.60 వేల నష్టం వచ్చింది. రూ.25 వేలు పెట్టుబడి పెట్టి సొర పంట వేస్తే అదికూడా మునిగిపోయింది. ఇప్పుడు మళ్లీ సాగు చేయాలంటే అప్పులు చేయాల్సిందే.

600 ఎకరాలకుపైగా నీట మునక



ప్రజాశక్తి-చేబ్రోలు : వర్షాల నేపథ్యంలో మండలంలో దాదాపు 600 పైన ఎకరాల వెద వరిపొలాలు నీట మునిగాయి. గొడవర్రు, నారా కోడూరు, వీరనాయకునిపాలెం, శేకూరు, శలపాడు గ్రామాల పరిధిలోని పొలాలు ముంపుబారిన పడి తాము తీవ్రంగా నష్టపోయామని రైతులు వాపోతున్నారు. వర్షాలు ఇంతటితో ఆగితే నీటిని బయటకు పంపి పైరును కాపాడుకోవచ్చని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. అయితే 10 రోజుల నుండి వెద పెట్టిన పోలీల్లో మాత్రం విత్తనాలు మొలకలు రాకుండా మురిగిపోయే ప్రమాదం ఉందని అంటున్నారు. వీర నాయకునిపాలెం, శలపాడు, శేకూరు పరిధిలో పొలాల నుండి అధిక వర్షపు నీరు పంట పొలాల నుండి బయటకు వెళ్లేందుకు అతి పెద్ద మురుగు తుంగభద్ర కాల్వ ఉన్నా గుర్రపుడెక్క పెరగటంతో నీటిపారుదలకు అడ్డంకిగా ఉందని రైతులు ఆవేదనకు గురవుతున్నారు. ఈ సమస్యను అధికారులకు ముందుగానే చెప్పినా పట్టించుకోలేదని విమర్శిస్తున్నారు. అధిక వర్షాలు పడినప్పుడు మాత్రమే మూడు గ్రామాల వంతెనల దగ్గర గుర్రపు డెక్కను కాల్వ అంచులకు నెట్టడం మినహా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం లేదని, ప్రతిసారీ ఇదే ఇబ్బంది ఎదురవుతోందని రైతులు చెబుతున్నారు. తాజాగా వారం రోజులుగా పడుతున్న వర్షాల వల్ల పొలాలలో నిలిచిన నీరు గురించి శనివారం ఉదయం నుంచి అధికారులతో మాట్లాడినా ఫలితం లేదని ఆ ప్రాంత రైతు గోపి తెలిపారు.

జిజిహెచ్‌లో ఫిర్యాదులు బాక్సులు

అధికారులకు కేంద్ర మంత్రి చంద్రశేఖర్ ఆదేశం

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి : గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లో ఫిర్యాదు బాక్సులను ఏర్పాటు చేసి రోగుల నుంచి ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేక విధానం అమలు చేయాలని, వచ్చిన ఫిర్యాదులను జిల్లా జాయింట్ కలెక్టర్ పర్యవేక్షణలో పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. శనివారం కలెక్టరేట్ లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలోని రెండవ సీటీ స్కాన్ మరమ్మతు వెంటనే చేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. బ్లడ్ బ్యాంకులో, పెథాలజీ విభాగంలో అవసరమైన పరికరాలు, వివిధ విభాగాల్లో ఏసీల కొనుగోలుకు సీఎస్ఆర్ నిధుల సమీకరణకు పరిశీలించాలన్నారు. వాహనాల పార్కింగ్ సమస్య పరిష్కారం కోసం పోలీస్, మున్సిపల్ అధికారుల సమన్వయంతో క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపి లాండ్స్ నిధులతో నిర్మిస్తున్న రోగుల సహాయకుల వెయిటింగ్ హాల్ పనులు వెంటనే పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైల్వే, ఆర్ అండ్ బీ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆర్వోబీ, ఆర్ యూ బీ ల నిర్మాణం, నిర్మాణంలో ఉన్న పెండింగ్ పనులపై రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. బుర్రిపాలెం వద్ద రైల్వే ట్రాకు వద్ద ఆర్ యు బి నిర్మాణంపై నివేదిక అందించాలని చెప్పారు. సమీక్షలో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎమ్మెల్యేలు మహమ్మద్ నసీర్ అహ్మద్, తెనాలి శ్రావణ్ కుమార్, బూర్ల రామాంజనేయులు మాట్లాడారు.

ఎన్‌సిఇఆర్‌టి సిలబస్‌పై సమగ్ర చర్చ జరపాలి

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

జాతీయ స్థాయిలో ఎన్‌సిఇఆర్‌టి ద్వారా రూపొందించిన సిలబస్‌పై సమగ్ర చర్చ జరపాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బ్రాడీపేటలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయం శనివారం నిర్వహించిన సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్య లక్ష్యం ఆ ప్రాంతంలో ఉన్న ప్రకృతి వనరులను ఉపయోగించుకొని సుఖవంతమైన జీవనం పొందే పౌరులను తరయారు చేయడమని తెలిపారు. ఈ లక్ష్య సాధన కోసం ప్రతిరాష్ట్రంలో ఎస్‌సిఇర్‌టిని స్థాపించారని చెప్పారు. దీని ద్వారా స్థానిక చరిత్ర, భౌగోళిక పరిస్థితులు, స్థానిక వనరులు, శీతోష్ణస్థితి, వ్యసాయం, వీటిపై విద్యార్థులకు ఒక సమగ్ర అవగాహన పెంపొందించేలా పాఠ్యాంశాలను రూపొందించేవారన్నారు. కానీ గత ఐదేళ్లుగా అంతర్జాతీయ విద్యార్థిని తయారు చేయడం లక్ష్యంగా ఎన్‌సిఇఆర్‌టి సిలబస్‌ని ప్రవేశపెట్టారని చెప్పారు. ఎలాంటి చర్చా లేకుండా ఈ సిలబస్ అమలు చేయడం వల్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర గందరగోళానికి గురవుతున్నారని తెలిపారు. స్థానిక చరిత్ర ఎక్కువ ఉన్న పుస్తకాలు స్థానంలో, అంతర్జాతీయ స్థాయి ఉన్న చరిత్రను ప్రవేశపెట్టడం వల్ల మన విద్యార్థులకు ఏమి ఉపయోగం ఉండదని, దీనివల్ల మన స్థానిక చరిత్రను తెలుసుకునే అవకాశం విద్యార్థులకు లేకుండా పోతుందని విమర్శించారు. రసాయన బంధం, మూలకాల వర్గీకరణ, పరమాణు నిర్మాణంలాంటి పాఠాలను తొలగించడం వల్ల ప్రకృతికి సైన్సుకి మధ్య ఉన్న సంబంధాన్ని విద్యార్థులు అర్థం చేసుకోవడానికి వీల్లేకుండా మార్చివేశారని తెలిపారు. హిందీ పాఠ్యాంశాలకు సంబంధించిన ఉత్తర భారతదేశ మాండలికాలు ప్రవేశపెట్టడం వల్ల ఇక్కడ ఉన్న విద్యార్థులకు ఆపదాలు తెలియక అయోమయానికి గురవుతున్నారని తెలిపారు. భవిష్యత్తులో పోటీ పరీక్షలకు ఉపయోగపడే పద్ధతిలో ప్రస్తుత గణితం, ఇంగ్లీషు పాఠ్యాంశాలు లేవన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఎన్‌సిఇఆర్‌టి సిలబస్‌పై ఒక సమగ్ర చర్చ జరపాలని కోరారు. యుటిఎఫ్ ప్రచురణల విభాగం రాష్ట్ర చైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ జిఒ 117ను రద్దు చేయాలని, ఉన్నత పాఠశాలలో సమాంతర మీడియంలు ప్రవేశపెట్టాలని, ప్రాథమిక పాఠశాలలో ఒకటినుండి ఐదు తరగతులు ఉండే విధంగా చూడాలని కోరారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్ మాట్లాడుతూ యుటిఎఫ్ స్థాపించి 50 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా స్వర్ణోత్సవాలు జరగబోతున్నాయని, వీటిని జిల్లాలోని ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శులు గోవిందు, కె.ప్రేమ్‌కుమార్, ఎం.కోటిరెడ్డి పాల్గొన్నారు

ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య



ప్రజాశక్తి -మాచర్ల

స్థానిక ప్రైవేట్ ఇంజనీరింగ్ కళశాలలో ఇంజనీరింగ్ ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థి శుక్రవారం రాత్రి తను అద్దెకు ఉంటున్న రూమ్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసు కున్నాడు. అనంత పురం జిల్లా, తాడిపత్రికి చెందిన దొడ్డి పవన్‌కల్యాణ్(22) స్థానిక ఇంజ నీరింగ్ కళాశాలలో 4వ సంవత్సరం చదువు తున్నాడు. ఆనా రోగ్య సమస్యలు ఎదుర్కోంటున్న పవన్‌కల్యాణ్ తాను అద్దెకు ఉంటున్న రూమ్‌లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తన తోటి విద్యార్థులతో కలిసి కల్యాణ్ మొయిన్ రోడ్డులోని నాయుడు దాబాకు ఎదురుగా రూమ్ అద్దెకు తీసుకోని ఉంటున్నారు. ఇతనితో పాటు ఉంటున్న ఇద్దరు పిల్లలు ఊరికి వెళ్ళటంతో గత రెండు రోజులుగా ఇతను ఒక్కడే రూమ్‌లో ఉంటున్నాడు. కల్యాణ్ తమ్ముడు రాజేంద్ర కూడా ఇక్కడే ఇంజనీరింగ్ చదువుతున్నాడు. అతను అతని బ్యాచ్ వారితో కలిసి మరో రూమ్‌లో ఉంటున్నాడు. రాత్రి 7 గంటల సమ యంలో అన్నయ్య ఫోన్ కలవకపోవటంతో రూమ్‌కు వచ్చి చూడటంతో ఉరి వేసుకుని చనిపోవడాన్ని గమనించాడు. ఈ విషయాన్ని తన తండ్రి శ్రీనివాసులుకు తెలియజేయటంతో ఆయన మాచర్ల వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల ఒత్తిడితో యువకుడి ఆత్మహత్య



ప్రజాశక్తి- నకరికల్లు

ప్రతి నెలా ఇఎంఐలు కట్టలేక ఒక యువకుడు ఉరి వేసు కొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రూపెనగుంట్ల గ్రామానికి చెందిన గువ్వల గోపి (22).అతని తండ్రి గ్రామ వీఆర్‌ఏగా చేస్తూ అనారోగ్యంతో మరణించాడు. ఉద్యోగాన్ని అతని తల్లికి ఇవ్వగా ఆమెకు విధుల్లో సహాయంగా ఉంటున్నాడు. కొంతకాలం క్రితం తల్లి ద్వారా డ్వాక్రా లోను, హౌస్ లోన్ తీసుకున్నాడు. ప్రతి నెల ఈఎంఐ కట్టలేక, తనకున్న ఆర్థిక ఇబ్బందులకు ఎవరూ సహాయం చేయకపోవడంతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. చనిపోయే ముందు అతను రాసిన సూసైడ్ నోట్ లో తన చావుకు ఎవరూ కారణం కాదని తెలిపాడు. మృతుని నాయనమ్మ గువ్వల కోటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగేంద్రరావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు.

రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా

నరసరావుపేటలోని పోలీస్ స్టేషన్లలో పల్నాడు ఎస్పీ కె.శీనివాసరావు తనిఖీలు



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు శనివారం నరసరావుపేట పట్టణంలోని 1వ ,2వ పట్టణ, గ్రామీణ, ట్రాఫిక్, సిసిఎస్ పోలీసు స్టేషన్లను ఎస్పీ కె.శ్రీనివాస రావు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.పోలీసు స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పని తీరు, విధులు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు, స్టేషన్ లో నిర్వహిస్తున్న కేసు డైరీ, వివిధ క్రైమ్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పోలీసు స్టేషన్ పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. మహిళా ఫిర్యాది దారులకు వెయిటింగ్ రూమ్ వుండాలని, పెండింగ్ లో ఉన్న వాహనాలను త్వరగా డిస్పోస్ చెయ్యాలనీ సూచించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తీసు కుంటున్న చర్యలను సమీక్షించారు. రోడ్డు భద్రతా నియమాల ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలని డ్రంకెన్ డ్రైవ్, రోడ్డు భద్రతా నియమాలపై ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు.

హత్యలు, హత్యా యత్నాలు, క్రైమ్ ఎగైనెస్ట్ ఉమన్, గర్ల్ మిస్సింగ్, ప్రాపర్టీ కేసులు, రోడ్డు ప్రమాదాలు, 174 సిఆర్,పిసి తదితర కేసుల రికార్డులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ లో నమోదైన కేసుల్లో పెండింగ్ కేసులు వాటి స్థితిగతులు, నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తు వాటి పురోగతిపై కేసుల ఫైల్స్ ను క్షుణ్ణంగా పరిశీలించి, నిందితులు అరెస్ట్ కాని కేసులలో నిందితులను త్వరగా టీమ్స్ ఫామ్ చేసి అరెస్ట్ చేయాలని ఆదేశించారు. సమన్లు, నాన్ బెయిలబుల్ వారెంట్లు పెండింగ్‌లో ఉంచకుండా సత్వర పరి ష్కారానికి చర్యలు తీసు కోవాలని ఆయా స్టేషన్ అధికారులను ఆదేశించారు. సాంకేతిక పరిజ్ఞానము ఉపయోగించి కేసులను త్వరితగతిన విచారణ పూర్తి చేసి, నిర్దేశిత కాల వ్యవధిలో కోర్ట్ లో ఛార్జ్ షీట్ ఫైల్ చేసి, సమర్థవంత ౦మైన ట్రయిల్ ద్వారా నిందితులకు కఠిన శిక్ష పడేలా చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని స్కూల్స్ వద్ద , హెూటల్స్ లాంటి ప్రదేశాలలో నిఘా ఏర్పాటు చేయాలని, ఎక్కువగా విజిబుల్ పోలీసింగ్ చేయాలని, సమర్థవంతమైన నేర నియంత్రణ, నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో గంజాయి నిర్మూలనకై కషి చేయాలని దానికి గాను ప్రత్యేక టీమ్స్ పెట్టి గంజాయి అమ్ముతున్న తాగుతున్న వారి నిఘా పెట్టీ అటువంటి వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అదే విధంగా రాత్రి, పగలు బీట్ పని తీరును నిరంతర మానిటరింగ్ చేయాలని, అప్పుడు నేరాలు తగ్గుతాయని తెలిపారు. రౌడీ షీటర్ల కదలికలు, కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, నేరాల అడ్డుకట్టకు నైట్ బీట్ వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు.

వేజెండ్ల క్వారీ కుంటలో గుర్తుతెలియని మృతదేహం

ప్రజాశక్తి -చేబ్రోలు

వేజండ్ల క్వారీ కుంటలలో పడి ఉన్న గుర్తు తెలియని వ్యక్తి మతదేహం. శనివారం క్వారీ కుంటలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహంను గుర్తించటం జరి గిందని, గ్రామ విఆర్ఒ చేబ్రోలు పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వటం జరిగిందని ఎస్ ఐ పి మహేష్ కుమార్ తెలిపారు. వీఆర్వో ఇచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి వెంటనే సంఘటన స్థలానికి చేరుకోవడం జరిగిందని అన్నారు. క్వారీ గుంటలో నీటిపై తేలుతూ వున్న మృతదేహాన్ని తన సిబ్బందితో బయటకు తీసినట్లు చెప్పారు. అనంతరం మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ సాధారణ వైద్య శాలకు తర లించినట్లు చెప్పారు. జరిగిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నామన్నారు.

ఎస్ఎఫ్ఐ చేబ్రోలు మండల నూతన కమిటీ ఎన్నిక



ప్రజాశక్తి -చేబ్రోలు

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) చేబ్రోలు మండల నూతన కమిటీని శని వారం ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా వి.జగదీష్, ఎ.సాయి, ఉపాధ్యక్షులుగా ఎ.అఖిలేష్, సహాయ కార్యదర్శిగా జి.అరుణ్ సహా 9 మంది సభ్యులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమా వేశంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వరరావు మాట్లా డుతూ విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థుల నైపుణ్యం పెరగాలన్నారు. విద్యారంగంలో సమ స్యలపై ఎస్ఎఫ్ఐ పోరాడుతుందని చెప్పారు. ప్రభుత్వ విద్యా రంగాన్ని పరిరక్షించుకోవాలన్నారు. నూతన జాతీయ విద్యా విధానం, విద్యారంగంలో అనేక మార్పులను తీసుకొస్తుందని, ఇవి పేద విద్యార్థులకు నష్టమన్నారు. ఇప్పటికే పాఠశాలలో మూసివేత, విద్య కేంద్రీకరణ లాంటి విషయాలపై గ్రామ స్థాయి విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం. కిరణ్, నాయకులు వై.యశ్వంత్, కె.అభి, కె.పుష్పహాస్, ఎ.తిరుమలేష్ పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ఎనిమిది మంది అరెస్ట్

ప్రజాశక్తి - మేడికొండూరు

పేరేచర్లలో జరిగిన హత్యాయత్నం కేసులో ఎనిమిది మంది నిందితులను శనివారం మేడికొండూరు పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్కు పంపారు. మేడికొండూరు పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్పి ఈ.అశోక్ కుమార్ గౌడ్ తెలిపిన కథనం మేరకు వివరాలు ఉన్నాయి. ఇటీవల జరిగిన పీర్ల పండుగ విషయమై డిజె సౌండ్ ఏర్పాటు చేసుకున్నారు. వాటి రేటు విషయమై ఏర్పడిన వ్యత్యాసానికి ఒకే సామాజిక వర్గానికి చెందిన కుటుంబాలలో ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారి తీసింది. అందులో భాగంగా షేక్ జాన్ పీరా అనే వ్యక్తి పైన మారణాయుధాలతో హత్యా యత్నం జరిగింది.



వివరాలు వెల్లడిస్తున్న తుళ్లూరు డిఎస్పి ఈ.అశోక్ కుమార్ గౌడ్

ఈ కేసు కు సంబంధించి 8 మంది నిందితులు షేక్ కరీముల్లా, షేక్ గన్ సైదా, షేక్ మర్రిపాలెం సుభాని, షేక్ మర్రి పాలెం ఘనీ సాహెబ్, షేక్ మర్రిపాలెం కరిముల్లా, షేక్ మర్రిపాలెం షాబాజ్, షేక్ మర్రిపాలెం అబ్రార్ అహ్మద్, షేక్ మర్రిపాలెం ఆసిఫ్‌లను జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్, డీఎస్పీ ఈ అశోక్ కుమార్ గౌడ్ ల ఆదేశాల మేరకు తెల్ల క్వారీ సమీపంలో ఎస్సై వాసు అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపారు.

గొడవల్లో తలదూరిస్తే పీడీ యాక్ట్

పేరేచర్ల లో జరిగిన హత్యాయత్నం కేసులో రౌడీ షీటర్ షేక్ మర్రిపాలెం సుభాని మరోమారు ముద్దాయి కావడంతో అతని మీద పీడీ యాక్ట్ కేసు నమోదు చేసినట్లు చెప్పారు. పీడీ యాక్ట్ ద్వారా ఆరు మాసాలు బెయిల్ రాదని తెలిపారు. అయినప్పటికీ రౌడీషీటర్ల ప్రవర్తనలో మార్పు రాకుంటే వారి ఆస్తులు జప్తు చేసేలా కేసులు బలంగా నమోదు చేస్తామని డిఎస్పీ హెచ్చరించారు. రౌడీషీటర్లు వివాదాల జోలికి వెళ్లకుండా సత్ప్రవర్తనతో ఉండాలని సూచించారు. సమావేశంలో మేడికొండూరు ఎస్‌హెచ్ఒ దార్ల జయకుమార్, ఎస్సై వాసు పాల్గొన్నారు.



చిలకలూరిపేటలోని సిఆర్ మోహన్ స్మారక స్థూపం వద్ద నివాళు లర్పిస్తున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులు

సిఆర్ మోహన్‌కు పారిశుధ్య కార్మికుల నివాళి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

సిఆర్ మోహన్ మూడో వర్ధంతి సందర్భంగా మున్సిపల్ పారిశుధ్య కార్మికులు స్థానిక ఎన్.ఆర్.టి. సెంటర్‌లోని ఆయన స్మారక స్థూపం వద్ద శనివారం పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం యూనియన్ నాయకులు కె.చెంచయ్య,అక్కులయ్య,అజయ్యలు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికు లకు అభ్యున్నతికి సిఆర్ మోహన్ ఎనలేని కృషి చేశారని,కార్మికులకు ఎటువంటి సమస్యలు వచ్చినా వెంటనే స్పందించి వాటి పరిష్కరించే దిశగా కృషి చేసే వారన్నారు. మోహన్‌కు జాతీయ, అంతర్జాతీయ అంశాలపై అవగాహన ఉన్న నాయకుడని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవసహాయం, ఆది నారాయణ, శివయ్య,పోతురాజు, మేరి,మార్థమ్మ, ద్రాక్షయని పాల్గొని పూలు వేసినివాళులు అర్పించారు.



వేల్పూరులో పంట పొలాల పరిశీలన

ప్రజాశక్తి-అచ్చంపేట

వాతావరణ పరిస్థితుల వల్ల అధిక తేమతో ప్రతి పంటలకు తెగులు సోకే అవకాశం ఉందని నివారణ చర్యలు తీసుకోవాలంటూ జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి అన్నారు శనివారం మండలం లోని వేల్పూరు గ్రామ రైతులతో కలిసి ప్రత్తి పంటను పరిశీలించి రైతులకు సూచనలు ఇచ్చారు ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో అధిక తేమ వలన తెగుళ్లు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది.ముందు జాగ్రత్తగా కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3గ్రా. లేదా ప్రోపికోనజోల్ 1మి.లి లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.పంట పొలాల్లో నీరు నిలవకుండా చూసుకోవాలి. వేరు కుళ్ళు తెగులు, వడలు తెగులు సోకిన మొక్కలు గిడస బారి ఎదుగుదల లేక ఎండి పోతాయి. ఆ మొక్కల చుట్టూ కాపర్ ఆక్సి క్లోరైడ్ లేక కార్బండజిమ్ ద్రావణం వారం వ్యవధిలో రెండు సార్లు పోసినట్లయితే మిగతా మొక్కలకి సోకకుండా చూసుకోవచ్చని తెలిపారు. వ్యవసాయ అధికారి పి.వెంకటేశ్వర్లు, సిబ్బంది మాన్య నాయక్ పాల్గొన్నారు.



జగనన్న కాలనీలు బురద మయం

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

ఎడతెరిపిలేని కురుస్తున్న వర్షాలకు జగనన్న కాలనీలు బురద మయంగా మారాయి. కాలనీల్లో మట్టి రోడ్లు బురద మయమైన నడిచేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. సత్తెనపల్లి మండలం సమీపంలో ఉన్న జగనన్న కాలనీలో డ్రైనేజీ కాలువలు రోడ్లు నిర్మించక పోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రోడ్లు నిర్మించాలని కాలనీ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

రైతుకు పెట్టుబడి సాయం అందజేయాలి



ప్రజాశక్తి-వినుకొండ : రైతులకు ఎన్నికలకు ముందు నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ ప్రకారం పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు అందజేయాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని విఠంరాజుపల్లి రైతు భరోసా కేంద్రంలో అసిస్టెంట్ నరేంద్ర శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం, కౌలు రైతు సంఘం, రైతు కూలీ సంఘం నాయ కులు మాట్లాడుతూ వ్యవసాయ పనులు ప్రారంభమవుతున్న సమయంలో పెట్టుబడి సాయం ప్రతి రైతు రూ.20 వేలు అందజేయాలని, అలాగే వ్యవసాయ కూలీలకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా 200 రోజులు పని దినాలు కనిపించాలని, యజమాని ప్రమేయం లేకుండా కౌలు రైతు కార్డులు అందజేయాలని, రెండు వారాలు పెండింగ్లో ఉన్న రైతు కూలీల వేతనాలను చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ముని వెంకటేశ్వర్లు, కె.హనుమంత్ రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-క్రోసూరు : రైతు , కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మండలంలోని 88 తాళ్లూరు, క్రోసూరు, దొడ్లేరు , ఊటుకూరు, బయ్యవరం, యర్రబాలెం, నాగ వరం గ్రామాల్లో వినతిపత్రాలు సమర్పించారు.గత మే నెలలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లో కూలీలకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, వ్యవసాయ మోటార్లకు విద్యుత్ మీటర్లు బిగించే జీవో నెంబర్ 22న రద్దుచేసి వ్యవసాయానికి ఉచిత విద్యుత్ కొనసాగించాలని, భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులను గుర్తించాలని వారు కోరారు.





అంగన్వాడీ యూనియన్ సమావేశంలో మాట్లాడుతున్న జి.మల్లేశ్వరి

అంగన్వాడీలపై రాజకీయ వేధింపులు ఆపండి

ప్రజాశక్తి-మాచర్ల

రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తరువాత అంగన్వాడీ కేంద్రాల్లో పనిచేసే కొంత మందిపై రాజకీయ ఒత్తిళ్ళు చేస్తు న్నారని, ఈవిధంగా చేయడం సమంజసం కాదని అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్య దర్శి జి.మల్లేశ్వరి అన్నారు. స్థానిక సిఐ టియు కార్యాలయంలో శనివారం అంగన్వాడీ యూనియన్ విస్తృత సమావేశం జరిగింది. సమావేశానికి స్థానిక నాయకు రాలు మహలక్ష్మీ అధ్యక్షత వహిం చారు. మల్లేశ్వరి మాట్లాడుతూ గ్రామీణ ప్రాం తాల్లో అతి తక్కువ వేతనాలతో మాతా, శిశు సంక్షేమ అభివృద్ధి శాఖలో పని చేసే వారిపై కక్ష సాధింపు చర్యలు అమా నుష మని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో అంగన్వాడీలపై జరిగిన వేధింపులకు ఆ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించు కుంద న్నారు. స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసు కుని వారిపై వేధింపులు లేకుండా చూడాలని కోరారు. సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్, అంగన్వాడీ వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు.

వరికపూడిసెలకు నిధులు కేటాయించండి : సిపిఎం

ప్రజాశక్తి-వినుకొండ

ఈ నెల 24 నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో నూతనంగా ఏర్పడ్డ ఎన్డీఏ ప్రభుత్వం పల్నాడు జిల్లాలోని వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు కేటాయించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.హనుమంత్ రెడ్డి శనివారం ఒక ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టు నిర్మాణానికి రూ.3500 కోర్టు ఖర్చు అవుతుందని ప్రభుత్వం అంచనా వేగా దానిలో మొదటి విడతగా రూ.1600 కోట్లు కేటాయించి విడుదల చేసి ప్రాజెక్టు పనులు ప్రారంభించాల్సి ఉందన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో 2023 నవంబర్ 15వ తేదీన అప్పటి సిఎం జగన్మోహన్ రెడ్డి మాచర్లలో శంకుస్థాపన చేశారని, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు చొరవతో అటవీశాఖ, వన్యప్రాణుల సంరక్షణ, పర్యావరణ శాఖ అనుమతులు లభించినప్పటికీ ఆ ప్రభుత్వం నిధులు కేటాయించలేదని వివరించారు. అటవీ శాఖ పరిధిలోని హెక్టాలలో పనులు ప్రారంభించు కోవడానికి మార్కాపురం డివిజన్ ఫారెస్ట్ వారికి 14.6 కోట్లు ప్రభుత్వం చెల్లిస్తే వైల్డ్ ఫారెస్ట్ పరిధిలో పనులు ప్రారంభించుకొనేందుకు ఇరిగేషన్ శాఖకు అనుమతులు ఇవ్వనుంది. కానీ గత ప్రభుత్వం నిధులు కేటాయించ కపోవడంతో ప్రజా ప్రతినిధుల ఒత్తిడి మేరకు ఇంజనీరింగ్ అధికారులు ప్రజలను మోసం చేసేందుకు వెల్దుర్తి మండలం పాపాయికుంట, హనుమాపురం తండాలోని రైతుల పొలాల్లో యంత్రాలతో గుంతలు తీసి పనులు ప్రారంభించినట్లు అప్పటి ఇరిగేషన్ మంత్రి అంబటి రాంబాబు, ఇప్పటి ఎమ్మెల్యేలు పెన్నెల రామకృష్ణారెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడు ప్రచారం చేసి రైతాంగాన్ని మభ్యపెట్టి మోసం చేశారని విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో నాడు నారా చంద్రబాబునాయుడు, లావు శ్రీకృష్ణదేవరాయలు, జీవి ఆంజనేయులు, జలగంటి బ్రహ్మారెడ్డిలు తాము అధికారంలోకి రాగానే బడ్జెట్‌లో నిధులు కేటాయించి పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రిచంద్రబాబునాయుడు వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు కేటాయించాలని, పల్నాడు ప్రాంత తాగు,సాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.



సబ్‌జైలులో పరిశీలన చేస్తున్న న్యాయ మూర్తులు

సబ్‌జైలును సందర్శించిన న్యాయమూర్తులు

ప్రజాశక్తి-సత్తెనపల్లి టౌన్

స్థానిక సబ్ జైలును సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్), మండల న్యాయ సేవాదికమిటి చైర్మన్ సిహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు , రెండోవ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) మహమ్మద్ గౌస్ శనివారం సబ్ జైలును సందర్శించారు. రికార్డులను,వంటగదిని తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జైల్లోని ఖైదీలతో మాటా ్లడారు. వారికి రోజు అందిస్తున్న భోజన వసతి, సౌకర్యల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఆర్థిక స్తోమత లేని ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం అందించేందుకు ప్రభుత్వమే ఉచిత న్యాయవాదిని అందిస్తుంది ఖైదీలకు వివరించారు. అనంతరం వారు జైల్లో పరిసరాలను, ఆహార పదార్ధలను వారు పరిశీలించారు .కార్యక్రమంలో న్యాయవాది బి ఎల్ కోటేశ్వరరావు పాల్గొన్నారు .

వర్షం.. పత్తికి జీవం..

ప్రజాశక్తి- సత్తెనపల్లి రూరల్



బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభా వంతో సత్తెనపల్లి లో ఎడతెరిపిలేని వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరిపి లేని వర్షాలు పత్తి పంటకు జీవంపోశాయి. నియోజకవర్గంలో ఖరీప్ సీజన్లో 14 వేల ఆరువందల ఎకరాల విస్తీర్ణంలో రైతులు పత్తి పంటను సాగు చేశారు. మొక్క దశలో ఉన్న పత్తి కి వర్షం జీవం పోసింది. కొన్ని చోట్ల పత్తి చేలల్లో వర్షపు నీరు చేరింది.

విద్యార్థిని తనూజకు ట్రిపుల్ ఐటిలో సీటు

ప్రజాశక్తి-పెదకూరపాడు



మండలంలోని 75 త్యాళ్ళూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కె.తనూజ ట్రిపుల్ ఐటీ ఫలితాల్లో ప్రతిభ కనబరిచింది. రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వ విద్యాలయం(ఆర్జీయూకేటీ) పరిధిలోని శ్రీకాకుళంలో ట్రిపుల్ ఐటీ క్యాంపస్ లో సీటు సాధించిన సందర్భంగా శనివారం పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమెను దుశ్శాలువతో సత్కరించి, బహుమతిని అందజేశారు. తనూజను స్ఫూర్తిగా తీసుకొని పదవ తరగతి విద్యార్థులు కష్టపడి చదవాలని ఉపాధ్యాయులు సూచించారు. తనూజ పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో కూడా 563 మార్కులు సాధించిన విషయాన్ని గుర్తుచేశారు. మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ కార్యక్రమంలో హెచ్ఎం డాక్టర్ ఎ.శ్రీనివాసరెడ్డి, పిసి చైర్మన్ జి.శ్రీనివాసరెడ్డి,ఉపాధ్యాయులు, విద్యార్థిని తల్లితండ్రులు పాల్గొన్నారు.

మునిగిన పొలాలు.. రోడ్లపై గుంతలు..


ఐతానగర్ శివారులో ముంపునకు గురైన వరి పొలాలు

ప్రజాశక్తి-తెనాలి

భారీ వర్షాలకు పంట పొలాలు ముంపుకు గురయ్యాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే రైతులు నష్టపోయే పరిస్థితులు నెలకొన్నాయి. తెనాలి మండలంలో 13 వేల ఎకరాల్లో ఖరీఫ్‌లో వరి సాగు చేస్తుండగా ఇప్పటికి 50 శాతం పొలాల్లో వెద పద్ధతిలో నాట్లు పూర్తయ్యాయి. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు బుర్రిపాలెం, నేలపాడు, తేలప్రోలు, ఐతానగర్ శివారు ప్రాంతాల్లోని పొలాలు ముంపునకు గురయ్యాయి. ఇంకా రెండు రోజుల పాటు వర్షాలుంటాయన్న వాతావరణ శాఖ ప్రకటన నేపథ్యంలో మొలకెత్తిన వరి కూడా పాడైపోతుందన్న ఆందోళనలో రైతులున్నారు. వాస్తవానికి సాగుదారుల్లో 80 శాతం కౌలు రైతులే. ఈ పరిస్థితుల్లో వారికి తిరిగి ఎద పెట్టుకోవాల్సి వస్తే సాగు ప్రారంభంలోనే రైతులకు ఎదురుదెబ్బ తగిలినట్టే.

తీవ్రంగా దెబ్బతిన్న రోడ్లు..

వర్షాలకు రోడ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. గత ప్రభుత్వంలో దెబ్బతిన్న రోడ్లకు కనీసం మరమ్మతులు కూడా చేయని సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వర్షాలకు రోడ్లు ద్విచక్ర వాహనాల రాకపోకలకు కూడా వీల్లేనంత ఇబ్బంది కరంగా తయారయ్యాయి. ముఖ్యంగా తెనాలి-గుంటూరు వయా నందివెలుగు మార్గంలో కొలకలూరు నుంచి హాఫ్‌పేట వరకూ ఎక్కడ పడితే అక్కడ రోడ్డు గుంతలు పడి వాటిల్లో వర్షపునీరు చేరటంతో పరిస్థితి మరింత ప్రమాద భరితంగా ఉంది. కొలకలూరులో జూబ్లీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ వద్ద, ప్రధాన కూడలిలో, ఖాజీపేట శివారులో, హాఫ్‌పేట గ్రామంలో రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి.


కూలేందుకు సిద్ధంగా హాఫ్‌పేట వంతెన

నందివెలుగు-గుంటూరు మార్గంలో హాఫ్‌పేటలో వంతెన కూలేందుకు సిద్ధంగా ఉంది. దాదాపు ఐదేళ్లుగా ఇదే పరిస్థితి ఉందని, అధికారులకు చెప్పినా పట్టించుకోవటంలేదని స్థానికులు వాపోతున్నారు. దాదాపు ఆరు నెలల క్రితం భారీ వాహనాల రాకపోకలు ఈ వంతెనపై నిషేదమంటూ ఆర్అండ్‌బి వారు ఓ ఫ్లెక్సీ పెట్టి వదిలేశారని చెబుతున్నారు. ఈ మార్గంలో ఇప్పటికీ భారీ వాహనాలైన ఇసుక టిప్పర్లు, ఇటుక లోడు లారీలు అధిక సంఖ్యలో తిరుగుతున్నాయని, ఏ సమయంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వంతెన కూలితే కొల్లిపర, హనుమాన్‌పాలెం, నందివెలుగు తదితర గ్రామాల నుంచి గుంటూరుకు


హాఫ్‌పేటలో రోడ్డు దుస్థితి

రాకపోకలు నిలిచిపోతాయని, అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చాలా కాలంగా చెబుతున్నా ఎవరూ పట్టించుకోవటంలేదు



ఆర్ వెంకటేశ్వర్లు, గ్రామస్తుడు

వంతెన పరిస్థితి ఐదేళ్లుగా అధ్వానంగా ఉంది. చర్యలు తీసుకోవాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు చెప్పినా ఎవరూ పట్టించుకోలేదు. పైగా ఇసుక టిప్పర్లు, ఇటుక లారీలు తిరుగుతుంటాయి. ఏ సమయంలోనైనా వంతెన కూలొచ్చు. ముఖ్యంగా పిల్లలు బడికి పోయే బస్సులు కాని, ఆర్టీసీ బస్సులు కాని ప్రమాదానికి గురైతే భారీ మూల్యం చెల్లించుకోవాల్సిందే.



వీధులన్నీ నీళ్లు.. బురద..

ప్రజాశక్తి - గుంటూరు సిటీ

నగరంలో మూడ్రోజులుగా కురుస్తున్న వర్షాలతో డ్రెయినేజీ సమస్యలు తలెత్తుతున్నాయి. కొన్ని లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలవగా డ్రెయినేజీ కాల్వలు రోడ్లపైకి చేరి రాకపోకలకు అసౌకర్యంగా మారింది. దీనికితోడు శారదా కాలనీ, పాత గుంటూరు, ప్రగతి నగర్, ఆనందపేట, సంగడిగుంట, నల్లచెరువు, శ్రీనివాసరావుపేట తదితర ప్రాంతాల్లో రోడ్లపైకి బురద చేరడంతో పాదచారులు అవస్థ పడుతున్నారు. వాహన రాకపోకల సందర్భంలో ఇతరులపై బురద, డ్రెయినేజీ నీరు పడుతోంది. రోడ్ల వెంట చెత్త ఎక్కడికక్కడ పేరుకుపోవడంతో దుర్గంధం వెదజల్లడంతోపాటు దోమలు వృద్ధి చెందుతున్నాయి. చిరు వ్యాపారులు తమ వ్యాపారాలు చేసుకోలేకపోతున్నారు. దోమల నివారణకు అధికారులు సత్వర చర్యలు చేపట్టకుంటే తాము రోగాల బారిన పడతామని ఆయా ప్రాంతాల ప్రజలు ఆందోళనగా ఉన్నారు.

పెట్టుబడి సాయం సత్వరమే జమ చేయాలి





ప్రజాశక్తి-తాడేపల్లి

ప్రస్తుతం సిఎం చంద్రబాబునాయుడు ఎన్నికల సందర్భంగా అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు, కౌలు రైతులకు ఇస్తానన్న రూ.20 వేల సాయం సత్వరం అందించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు కోరారు. శనివారం ఉండవల్లి ఆర్‌బికె కేంద్రంలో వ్యవసాయ సహాయకులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటలకు వ్యవసాయ ఉత్పత్తి ఖర్చులపై 50 శాతం అదనంగా కలిపి మద్దతు ధరలు నిర్ణయించాలని కోరారు. మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు పెనుభారంగా మారే విద్యుత్ ప్రైవేటీకరణ చట్టం 2022 వెనక్కి తీసుకోవాలని కోరారు. ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు, వ్యవసాయ యంత్రాలపై జిఎస్‌టిని రద్దు చేయాలని కోరారు. కేరళ తరహా రుణ విముక్తి చట్టాన్ని తీసుకు రావాల్సిన అవసరముందని చెప్పారు. భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులకు కార్డులివ్వాలని, కొండవీటి వాగులో తూటుకాడ, గుర్రపుడెక్క తొలగించాలని ఉండవల్లి లిఫ్టు ఇరిగేషన్ స్కీమ్ విద్యుత్ బకాయిలు ప్రభుత్వమే చెల్లించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.ఈశ్వరరెడ్డి, వీరస్వామి, ఎస్‌కె పీరూసాహెబ్, టి.బక్కిరెడ్డి, రామారావు, సంజీవరెడ్డి, రామిరెడ్డి, కాశిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

మండలంలోని గుండెమెడ, చిర్రావూరు గ్రామాల్లో రైతు, కౌలురైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బందికి వినతి పత్రాలను ప్రజాసంఘాల నాయకులు అందజేశారు. రైతు సంఘం నాయకులు డి.వెంకటరెడ్డి మాట్లాడారు. ఉపాధి హామీ కూలీలకు ఏడాదిలో 200 రోజులు పని దినాలు పెంచి, రోజువారి వేతనం రూ.600 ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పి.కృష్ణ, పి.శివనాగేశ్వరరావు, బి.సంసోన్, ఎన్.విజయరాజు, పి.సుబ్బారావు, ఎం.పాములు, జి.విజయరాజు, సాంబయ్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మేడికొండూరు

భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా కౌలురైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మండలంలోని సిరిపురం, వెలవర్తిపాడు గ్రామాల్లో సచివాలయ అధికారులకు రైతు, కౌలురైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో వినతి పత్రాలు అందజేశారు. జిల్లాలో లక్ష మంది కౌల్దార్లుండగా కొంతమందికే గుర్తింపు కార్డులిచ్చారని విమర్శించారు. ఈసారైన రైతు సంక్షేమ పథకాలను కౌల్దార్లకు వర్తింపజేయాలని కోరారు. ఇటీవల వర్షాల వల్ల డెల్టా



ప్రాంతంలో వెద పద్ధతిలో వేసిన వరి పొలాలు నీటిలో మునిగి నష్టపోయారని, మరలా నాటుకోవడానికి ప్రభుత్వం సహాయం చేయాలని కోరారు. ఇరిగేషన్ కాల్వలు, వాగుల్లో పేరుకుపోయిన తూటాకు, కంప చెట్లను వెంటనే తొలగించాలని కోరారు. ఉపాధి హామీ కూలీలకు పెండింగ్ వేతనాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో డి.ఆంజనేయులు, ఎన్.చిలకయ్య, శ్రీధర్, శివయ్య, షేక్ ఇమామ్ షరీఫ్, షేక్ మూర్తిజ, షేక్ సుభాని, రఫీ, కాసిం సైదా, షేక్ బుజ్జి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడికొండ

నియోజవవర్గ కేంద్రమైన తాడికొండ పంచాయతీ కార్యదర్శి పి.శ్రీనివాసులురెడ్డికి, సచివాలయ కార్యదర్శులకు రైతు సంఘాల నాయకులు వినతిపత్రం ఇచ్చారు. రైతు సంఘం నాయకులు సిహెచ్.భాస్కరరావు మాట్లాడుతూ రైతులకు భారంగా ఉన్న గత ప్రభుత్వం జారీ చేసి జీవో 22ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు, కౌలురైతులకు రూ.2 లక్షల లోపు రుణాలను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఐ.రామారావు, బి.భద్రయ్య, జోషి, ఎం.వెంకటేశ్వర్లు, జె.కోటిరెడ్డి, సుభాని, సత్యనారాయణ పాల్గొన్నారు.





పొంగిపొర్లుతున్న కోటేళ్లవాగు

ప్రజాశక్తి - తుళ్లూరు

వర్షాల నేపథ్యంలో మండలంలోని పెదపరిమి వద్ద కోటేళ్ల వాగులోకి పెద్ద ఎత్తున వాన నీరు వచ్చి వాగుపై ఉన్న లో లెవెల్ చప్టా మీదుగా నీరు ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. ఎగువ ప్రాంతం నుండి నీరు వచ్చి చేరడంతో వాగుకు సమీపంలో ఉన్న పొలాలు నీట మునిగే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వాగులపై ఉన్న లో లెవెల్ చప్టాలను హై లెవెల్ చప్టాలుగా అభివృద్ధి చేయాలని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పాలకులకు పట్టడం లేదని వాపోతున్నారు. కోటేళ్ల వాగుతో పాటు పెదపరిమి - నెక్కల్లు మధ్య చీకటివాగు,పెదపరిమి - మోతడక, పెదపరిమి - నీరుకొండ మధ్య వాగులు పొంగి రోడ్లు మీదుగా నీరు ప్రవహిస్తోంది.


సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

కలెక్టరేట్ విభాగాల్లో కలెక్టర్ తనిఖీలు

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి శనివారం కలెక్టర్ కార్యాలయంలోని పలు విభాగాలను తనిఖీ చేశారు. విభాగాల్లోని అటెండెన్స్ రిజిస్టర్లు, ఇన్‌వర్డ్, అవుట్‌వర్డ్ రిజిస్టర్లను ఎలా నిర్వహిస్తున్నారో పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి కంప్యూటర్స్, ప్రింటర్స్, జిరాక్స్ మిషన్లు పనిచేస్తున్నాయా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం రూఫ్‌కు సంబంధించి ఏమైనా ఇబ్బందులు వున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. సిబ్బందిలో స్త్రీ, పురుషులకు వేర్వేరుగా ఏర్పాటు చేసిన టాయిలెట్స్ పరిశీలించి మరింత పరిశుభ్రంగా వుండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టరేట్‌లోని జె.సి, డి.ఆర్.ఓ ఛాంబర్లను, కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డిఆర్‌ఓల క్యాంపు క్లర్కుల పేషీలను పరిశీలించారు. ఎన్ఐసి, ఎ.పి స్వాన్ విభాగాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. రికార్డ్ రూమ్‌ను పరిశీలించి రూమ్‌కు ఎదురుగా వున్న కారిడార్‌లో పనికిరాని ఫర్నీచర్‌ను తొలగించాలని డిఆర్‌ఓకు సూచించారు.

విజ్ఞాన్స్ విద్యార్థికి పీహెచ్‌డీ



ప్రజాశక్తి-గుంటూరు

వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ, ఈఈఈ విభాగం విద్యార్థి ముత్తుకూరి నరేంద్రకుమార్‌కు తమ యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా అందజేసిందని వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నరేంద్రకుమార్ 'డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ ప్రొపోర్షనల్ రీసోనంట్ క్రంటోల్డ్ సింగల్ ఫేస్‌ఫిఫ్టీన్ లెవల్ ప్యాక్డ్ యూసెల్ మల్టీలెవల్ ఇన్వర్టర్ పీవీ అప్లికేషన్స్' అంశంపై పరిశోధన చేశారని, అతనికి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని ఈఈఈ డిపార్ట్‌మెంట్‌లో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మోపిదేవి సుబ్బరావు గైడ్‌గా వ్యవహరించారని పేర్కొన్నారు. నరేంద్ర కుమార్‌ను ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపకులు అభినందించారు.



రూ.50 వేల బీమా చెక్కు అందజేత

ప్రజాశక్తి- పెదకూరపాడు

మండలంలోని బలుసుపాడు గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త వామనపల్లి ఆదినారాయణకు బీమా సొమ్ము రూ.50 వేల చెక్కును జనసేన జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వరరావు శనివారం అందించారు. గత ఏడాది మే 26న ఆదినారాయణ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అందుకుగాను బీమా సొమ్ము వచ్చింది. జనసేన సభ్యత్వము కలిగి ఉంటే బీమా వస్తుందని వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రతి కార్యకర్త సభ్యత్వం కలిగి ఉండాలని ఆయన అన్నారు. వారివెంట సమన్వయ కర్త యర్రంశెట్టి రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు మల్లెల చలపతిరావు, ఉపాధ్యక్షులు ప్రత్తి శౌరీ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే భార్య ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పెదకూరపాడు

మండలంలోని కాశిపాడు గ్రామానికి చెందిన మండల తెలుగుదేశం పార్టీ ఎస్సీ నాయకులు నీలం రత్నకుమార్ కుటుంబాన్ని నియోజకవర్గ పార్టీ ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ భార్య లావణ్య శనివారం పరామర్శించారు. ఆ కుటుంబానికి ఆమె ఆర్థిక సహాయం అందించారు.

అరబ్ దేశాల్లో తెలుగువారి స్థితిగతులపై అధ్యయనం చేయండి : లోక్‌సత్తా పార్టీ

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఉపాధి కోసం అరబ్ దేశాలకు వెళ్లిన తెలుగువారి స్థితిగతులపై అధ్యయనం చేయాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ మాదాసు భాను ప్రసాద్ కోరారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటనలో అన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇటీవల శివ అనే వ్యక్తిని తాను పడుతున్న కష్టాలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం ద్వారా వైరల్ గా మారి మంత్రి లోకేష్ చొరవతో బయటపడిన సంఘటన అనంతరం కూడా ఇంకా మరికొందరు వారు ఎదుర్కొంటున్న చిత్రహింసల ను సోషల్ మీడియా ద్వారా ఏకరువు పెడుతున్నట్లు తెలిపారు.

ఉపాధి అవకాశాల కోసం ఎంతోమంది మన తెలుగు రాష్ట్రాల నుండి పొ ట్ట చేత పట్టుకొని అరబ్ దేశాలకు వెళుతున్నారని, వీరిలో కొందరు నకిలీ ఏజెంట్ల ద్వారా ఆయా దేశాలకు వెళ్లి దుర్భర పరిస్థితులను అనుభవి స్తున్నారని తెలిపారు. వారి స్థితిగతులు జైళ్లలో ఉన్న ఖైదీల కన్నా హీనంగా ఉంటోందని, అరబ్ దేశాల్లో ఇళ్లల్లో పనులు నిమిత్తం మహిళలను తీసుకొని వెళ్లి వాళ్లతో గొడ్డు చాకిరి చేయించుకోవడమే కాకుండా వారిపై బలాత్కారా నికి పాల్పడుతున్న సంఘటనలు వెలుగుచూస్తున్నట్లు తెలిపారు. దీనిపై పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని కోరారు. ప్రభుత్వం, ఆయా దేశాల్లో ఉన్న రాయబార కార్యాలయాలను అప్రమత్తం చేసి అటువంటి వారందరినీ స్వదేశానికి తీసుకురా వాలన్నారు. అదే క్రమంలో నకిలీ ఏజెంట్ల పట్ల కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

ముందస్తు చర్యలు శూన్యం.. చిన్న వర్షానికే జలమయం..

- ముున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు: కంభంపాలెం నివాసులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణంలో ఇప్పటి వరకు ఇంకా ఓ మోస్తరు మినహా భారీగా వర్షాలు కురవలేదు. వర్షాలు కురిస్తే లోతట్టు ప్రాంతాలలో నీరు నిలబడే ప్రమాదం కనిపిస్తుంది. ఇది ప్రతి ఏటా ఉంటుండగా అధికారులు, పాలకవర్గం శాశ్వత చర్యలు చేపట్టడం లేదు. వేల సంఖ్యలో జనాభా ఉండే ప్రాంతాల్లో ముంపు తలెత్తితే నష్టం భారీగానే ఉంటుంది. పట్టణంలో ఒవైపు మురుగు కాలువలు సరిగ్గా లేకపోగా వర్షం నీరు మురుగునీటితో కలిపి రోడ్లపై ప్రవహిస్తుంది. గతేడాది కురిసిన వర్షాలకు చాలా ఇండ్లలోకి నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఎత్తు ప్రదేశంలో ఉన్న కాలనీల నుంచి వచ్చే నీటితో లోతట్టు ప్రాంతాల వారు బయటకు వెళ్లే పరిస్థితి ఉండటం లేదు. ఈసారైనా ఈ పరిస్థితి రాకుండా చూడాలని లోతట్టు ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



ఓ ఇంటి ముందు మురుగు పారని పరిస్థితి

వర్షం వచ్చిందంటే నరసరావుపేట పట్టణంలో కొన్ని ప్రాంతాలలో ప్రజలు వరద నీరు ఎప్పుడు వస్తుందోనని భయపడుతున్నారు. కొద్దిపాటి వర్షానికి నీరు నిలిచి ఇబ్బంది పెదుతుందని ప్రజలు వాపోతున్నారు. మురుగు కాలువల్లో పూడిక పేరుకుపోయింది. కూరగాయల మార్కెట్, బాపనయ్య,నగర్, కంభంపాలెం,వెంగళరెడ్డి నగర్, బస్టాండ్ ప్రాంతాలు మురుగునీరుతో అడుగుపెట్టే పరిస్థితి లేకుండా పోతుంది. ఇప్పటికైనా అధికారులు పాలకవర్గం దష్టి సారించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. పరిసరాల శుభ్రంగా లేకపోతే ప్రజలు సీజనల్ వ్యాధులు భారిన పడే ప్రమాదం పొంచి ఉంది.

లోతట్టు ప్రాంతాల్లో చర్యలేవి

సునీల్, కంభంపాలెం, నరసరావుపేట



జిల్లా కేంద్రంలోని లోతట్టు ప్రాంతాల్లో వర్షం పడితే తీసుకోవాల్సిన కనీస చర్యలు కనిపించడం లేదు. భారీ వర్షాలు వచ్చినప్పుడు అప్పటికప్పుడు తాత్కాలిక చర్యలు చేపట్టి అంతటితో వదిలేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో పాలకులు, అధికారులు శాశ్వత పరిష్కారంపై దృష్టి పెట్టకపోవడంతో ప్రతి ఏటా వర్షాకాలంలో ఇబ్బందులు తప్పడం లేదు.



చిన్నపాటి వర్షానికే కంభంపాలెం ప్రధాన వీధిలో పొంగి పొర్లుతున్న మురుగుకాల్వ

ప్రత్యేక చర్యలు చేపట్టాం

సి.రవి చంద్రారెడ్డి.. మున్సిపల్ కమిషనర్, నరసరావుపేట



పారిశుధ్యం మెరుగుదలకు పురపాలక సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టాం. పరి సరాల శుభ్రతకు సీజనల్ వ్యాధులు నివారణకు ప్రణాళిక బద్ధంగా పనిచేసేలా సిబ్బందిని అప్రమత్తం చేశాం. లోతట్టు ప్రాంతాలలో ఏమైనా ఇబ్బందులు ఉంటే ప్రజలు పురపాలక సంఘం అధికారులు దష్టికి తీసుకు వస్తే సరైన భద్రతా చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నాం.

ప్రతి ఇంటికీ తాగునీరు అందించడమే లక్ష్యం

ప్రజాశకి-నకరికల్లు

ప్రతి ఇంటికి సురక్షిత తాగునీరు అందించడమే లక్ష్యమని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు అన్నారు. నకరికల్లులోని తాగునీటి రిజర్వాయర్‌ను, క్షేత్రస్థాయిలో గట్లను ఆర్డబ్ల్యూఎస్, మున్సిపల్ అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా చదల వాడ మాట్లాడుతూ గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా రిజర్వాయర్ నీటి ప్రవాహం పెరగడంతో చెరువు గట్ల పటిష్టత గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సాగర్ కుడి కాలవ నుండి నీరు విడుదల చేయగా చెరువులో తాగునీరు చేరికపై హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గ పరిధిలో ఏ ఒక్కరికి తాగునీటి ఇబ్బంది లేకుండా చూసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవి చంద్రరెడ్డి, డిఈ ఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



నకరికల్లులోని గట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు



పూడికతీత పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణంలోని బరంపేట,బీసీ కాలనీ, సత్తెనపల్లి రోడ్డులోని ప్రజలకు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు చొరవతో బురద నుండి విముక్తి లభించింది.కోడెల శివప్రసాద్ స్టేడియం పక్కనున్న స్ట్రాం వాటర్ డ్రైన్‌లో దశాబ్ద కాలంగా నిర్వహణ లేక పేరుకు పోయిన మురుగును తొలగించారు.చెత్త చెదారంతో నిండిన కాలువ పై ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ప్రత్యేక శ్రద్ధ వహించి పనులు చేయించారు.వర్షాలు పడిన ప్రతి సారి మురుగు నీరు కాలువ నుండి రోడ్లపైకి, సమీపంలోని జనావాసాల్లోకి చేరుతుండడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. తాజాగా వర్షాలు పడుతుండడం మురుగు పేరుకునే అవకాశం ఉన్న మున్సిపల్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించిన నేపథ్యంలో మురుగు తొలగింపు పనులు చేపట్టారు. జెసిబి సహాయంతో కాలువలో పేరుకున్న జమ్ము, సిల్ట్,ఇతర చెత్తను తొలగించారు. ప్రజలకు సదుపాయాలు కల్పించడం పైనే కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్,మున్సిపల్ డి.ఈ,ఏ.ఈ టిడిపి నాయకులు క్రాంతి, రఫీ,బాలు తదితరులు పాల్గొన్నారు.

ఎపి మోడల్ స్కూల్‌ను పరిశీలించిన ప్రత్యేకాధికారి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రొంపిచర్ల మండలంలోని వి.రెడ్డిపాలెం ఎపి మోడల్ స్కూల్ ను శనివారం మండల ప్రత్యేక అధికారి కె.సూర్యప్రకాష్ రెడ్డి పరిశీలించారు. ఆ పాఠశాలలో తరగతి గదులను పరిశీలించి ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధించే విధానాన్ని పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. పాఠశాల రికార్డులను, హాస్టల్ పనితీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. విద్యార్థుల హాజరు పట్టికను, రికార్డులను, ఉపాధ్యాయుల పనితీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ-2 డి.బ్రహ్మేశ్వరరావు, ఎపి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రవి నాయక్, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కె.సూర్యప్రకాష్‌రెడ్డి

కలెక్టర్ ను కలిసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పెదకూరపాడు



పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు ని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మర్యాద పూర్వకంగా శనివారం కలిశారు. కలెక్టర్‌ను సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లా డుతూ నియోజక వర్గంలోని పలు అంశాలపై చర్చించినట్లు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరినట్లు కోరారు.

సాంఘిక నాటకాల నూతన కమిటీ అధ్యక్షుడిగా సాల్మన్ రాజు



ప్రజాశక్తి-వినుకొండ

సాంఘిక నాటకాల నూతన కమిటీ అధ్యక్షుడిగా అమతపూడి సాల్మన్ రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొత్తపేట లోని సాంఘిక నాటకాల వినుకొండ డైరెక్టర్ అండ్ డాన్స్ మాస్టర్స్ అసోసియేషన్ గుర్రం జాషువా కళానికేతన్ కళాకారుల సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వ హిం చారు. ఆంధ్ర ప్రదేశ్ నాటక రంగా కళాకారులు డైరెక్టర్స్ అండ్ డాన్స్ మాస్టర్ అండ్ హీరోయిన్స్ అండ్ స్టేజి ఓనర్స్ వర్కర్స్ నటీనటులు ఈ సందర్భంగా సాల్మన్‌రాజ్‌కు అభి నందనలు తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-పెదకూరపాడు



డాక్టర్ ఆదిత్య

వర్షాలు అధికంగా ఉండటంతో ప్రతి ఒక్కరూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మండలం లోని 75 తాళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ఆదిత్య శనివారం ప్రకటనలో తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డయేరియా, డెంగీ వ్యాధులపై ప్రజలు కాచిన నీళ్ల పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా మురుగు కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకొని పరిశుభ్రంగా ఉండాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడు ఇలాంటి వ్యాధులు దరిచేరకుండా ఉంటాయని ఆయన అన్నారు.ముఖ్యంగా జిల్లా డిఎంహెచ్ఓ ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో వైద్య క్యాంపులు నిర్వహించి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా వైద్య సేవలు అందిస్తున్నామన్నారు.ఎవరైనా ఇబ్బంది ఉన్నప్పటికీ దగ్గర్లో ఉన్న హాస్పటల్ కి వెళ్లి వైద్యం చేయించుకోవచ్చని డాక్టర్ సలహాలు సూచనలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు కూడా ఇస్తామని ఈ అవకాశాన్ని గ్రామీణ ప్రాంత ప్రజలు ఉపయోగించుకోవాలని డాక్టర్ ఆదిత్య అన్నారు.

నిబంధనల మేరకే భవనాలు నిర్మించాలి



భవనం కొలతలు పరిశీలిస్తున్న కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

నగరంలో బహుళ అంతస్తు నిర్మాణాలు నిర్దేశిత నిబంధనల మేరకు మాత్రమే చేపట్టాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేసిన భవనాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసి) కోసం సిఫార్స్ చేసిన టిపిఎస్, సంబంధిత వార్డ్ ప్లానింగ్ కార్యదర్శులకు చార్జెస్ ఫ్రేం చేయాలని సిటీ ప్లానర్‌ను ఆదేశించారు. శనివారం కమిషనర్ బృందావన్‌గార్డెన్స్ 7వ లైన్‌లో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌కి దరఖాస్తు చేసుకున్న భవనాన్ని పరిశీలించి, నిబంధనలకు విరుద్ధంగా ఫైల్ పెట్టిన అధికారులపై చర్యలు తీసుకుంటూ ఆదేశాలు జారీ చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే తగిన చర్యలు తీసుకోవాలని, పట్టణ ప్రణాళిక అధికారులను పలుమార్లు ఆదేశించినప్పటికీ కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. బృందావన్ గార్డెన్స్ 7వ లైన్‌లో ఓసీ కోసం దరఖాస్తు చేసుకున్న బహుళ అంతస్తు భవనం నిర్దేశిత నిబంధనలకు 18 శాతం అతిక్రమించి నిర్మాణం జరిగిందని, అటువంటి భవనానికి ఓసీ కోసం తమకు ఫైల్ పంపిన సంబంధిత టిపిఎస్ రిజ్వానా, 117 వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శి తనూజకు చార్జెస్ ఫ్రేం చేయాలని సిటీ ప్లానర్‌ను ఆదేశించారు. అనుమతి పొందిన ప్లాన్‌కు భిన్నంగా రెసిడెన్షియల్‌కు అనుమతి తీసుకొని కమర్షియల్‌గా వినియోగిస్తున్న పలు భవనాలపై ఫిర్యాదులు అందాయని, నిబంధనలు అతిక్రమించిన భవనాలకు నామమాత్రపు నోటీసులు ఇచ్చిన అధికారులపై కూడా ఫిర్యాదులు అందాయని అన్నారు. నిబంధనలు అతిక్రమించిన భవనాలను ఆకస్మిక తనిఖీలు చేస్తామని తెలిపారు. ఎల్‌టిపిలు నూతనంగా బహుళ అంతస్తు భవనాలకు అనుమతుల కోసం ఆన్‌లైన్ ద్వారా డిపిఎంఎస్‌లో తప్పనిసరిగా నిర్దేశిత ధృవ పత్రాలు, నిబంధనలకు అనుగుణంగా దరఖాస్తు చేయాలని, లేకుంటే తదుపరి అనుమతుల జారీ నిలిపేస్తామన్నారు. సెట్‌బ్యాక్ పోర్షన్‌లో, రోడ్ వైడినింగ్ పోర్షన్‌లో ఎటువంటి నిర్మాణం చేసినా, నిర్ణీత ఎత్తు మించినా కూడా ఆక్యుపెన్సీ ఇవ్వబోమన్నారు. పర్యటనలో సిటి ప్లానర్ ప్రదీప్‌కుమార్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మురళి, టిపిఎస్ రిజ్వాన, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు

దీర్ఘకాలంగా జిఎంసి పరిధిలో వీధికుక్కల వల్ల ఎదురవుతున్న సమస్యల పరిష్కారంలో భాగంగా వీధి కుక్కల సంతాన నియంత్రణ ఆపరేషన్లు, యాంటీ రేబిస్ టీకాలు చేయటానికి శాశ్వత కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామని నగర కమిషనర్ కీర్తిచేకూరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు ప్రజలు, జంతుప్రేమికులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సహకరించాలని కోరారు. జాతీయ జంతు సంక్షేమ సంఘం, హర్యానా వారి గుర్తింపు పొందిన స్నేహ యానిమల్ వెల్ఫేర్ సొసైటీ టెండర్ల ద్వారా రాష్ట్ర ప్రభుత్వంచే 2023-26కుగాను నగరంలో వీధి కుక్కలకు సంతాన నియంత్రణ, యాంటి రేబీస్ టీకాలు నిర్వహించడానికి ఒప్పంద అనుమతులు పొందినట్లుతెలిపారు. నగరంలో షుమారు 35 వేల వీధి కుక్కలు ఉన్నాయని, వాటిలో ప్రతిరోజు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకూ 30-35 వరకు ఆపరేషన్లు జరుగుతున్నాయని పేర్కొన్నారు. వాటిని రోజుకి 50 వరకు చేయడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. జిఎంసి అధికారుల కమిటీ పర్యవేక్షణలో నిర్దేశిత నిబంధనల మేరకు స్థానిక ఏటుకూరు రోడ్డులోని ఎబిసి సెంటర్‌లో నిపుణులైన పశువైద్యులచే వీధి కుక్కలకు సంతాన నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించి, అనంతరం వాటికి తగువైద్యం, ఆహారం అందించి, కోలుకున్న 4 రోజుల తర్వాత ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు మళ్లీ యథాస్థానంలో విడిచి పెడతామని తెలిపారు. రేబిస్ లక్షణాలతో వీధి కుక్కలను గుర్తిస్తే జిఎంసి కాల్‌సెంటర్ 0863-2345103కి ఫోన్ చేసి వివరాలు అందిస్తే, ప్రాధాన్యత క్రమంలో వీధి కుక్కలను పట్టుకొని యాంటి రేబిస్ వ్యాక్సిన్, ఆపరేషన్లు చేస్తామని తెలిపారు. తమ ప్రాంతాలకు జిఎంసికి చెందిన నిపుణులైన సిబ్బంది వాహనంతో వచ్చినప్పుడు వీధి కుక్కలను పట్టించడంలో అందరూ సహకరించాలని కోరారు.



వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-గుంటూరు : వర్షాల నేపథ్యంలో పాఠశాలల్లో విద్యార్థులు వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు జాగ్రత్తలు తీసుకోవాలని పాఠశాల విద్య ఆర్‌జెడి బి.లింగేశ్వరరెడ్డి అన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిఎంసి పరిధిలోని ప్రైవేటు యాజమాన్యాలతో డెంగీ, మలేరియా వ్యాధుల గురించి అప్రమత్తం చేయటానికి విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక పాతబస్టాండ్ వద్ద పరీక్షా భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఆర్‌జెడి మాట్లాడుతూ పాఠశాల ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, తల్లిదండ్రులలో డెంగీ వ్యాధులపై చైతన్యం కల్పించాలని చెప్పారు. డిఇఒ పి.శైలజ మాట్లాడుతూ విద్యార్థులు భోజనం చేసే ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం జిల్లా ఎన్‌సిడి అధికారి శ్రావణబాబు, జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం, గుంటూరు ఉప విద్యాశాఖ అధికారి పి.వెంకటేశ్వరరావు మాట్లాడారు.

పారిశుధ్యం అస్తవ్యస్తం.. రోగాల భయం..



ప్రజాశక్తి - మంగళగిరి

వర్షాల నేపథ్యంలో పట్టణంలోని టిడ్కో గృహాలు, కూరగాయల మార్కెట్, రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యాలయం చుట్టూ నీరు చేరింది. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో పారుదల లేక ఎక్కడి నీరు అక్కడే నిలిచి దోమలు వ్యాపిస్తున్నాయి. టిడ్కో అపార్టుమెంట్లలో ఏడాదిన్నర నుండి 1728 కుటుంబాల నివాసం ఉంటున్నా పటిష్ట డ్రెయినేజీ వ్యవస్థ లేదు. మురుగు కాల్వలు కాల్వల్లో పారుదల లేకపోవడంతో నిత్యం దోమలు ఉధృంగా పెరుగుతున్నాయి. ప్రస్తుతం వానలతో పరిస్థితి మరింత క్షీణించింది. తాము రోగాల బారిన పడకుండా అధికారులు సత్వరం స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

ముంపు బారిన పడకుండా పనులు

నాలుగు రోజుల నుంచి వాన కురుస్తున్న దృష్ట్యా రత్నాల చెరువులోని ఎస్టీ కాలనీ ప్రాంతం ముంపు బారిన పడే అవకాశం ఉంది. గతంలోనూ పలుమార్లు ఈ ప్రాంతం నీట మునిగింది. ఈ అనుభవాల దృష్ట్యా ప్రత్యేక చర్యల కోసం స్థానికులు మంత్రి నారా లోకేష్‌కు ప్రజాదర్బార్‌లో విన్నవించారు. మంత్రి ఆదేశాలతో అధికారులు పొక్లెయినర్‌తో పనులు చేయించారు.

చర్మకారులకు రుణాల కోసం వినతి

చర్మకారులు, డప్పు కళాకారులకు రుణాలు మంజూరు చేయాలని మంత్రి నారా లోకేష్‌కు మంగళగిరి చెందిన చర్మకారుల సేవా సంఘం మహిళా అధ్యక్షులు బుల్లా శారమ్మ విన్నవించారు. ఉండవల్లిల్లో మంత్రి నిర్వహిస్తున్న ప్రజాదర్బారులో శనివారం వినతిపత్రం ఇచ్చారు. నియోజకవర్గంలో 250 మంది చర్మకారులకు, డప్పు కళాకారులు ఉన్నట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు.

సామాజిక మాధ్యమాలతో కాలం వృథా

మొవ్వా విజయలక్ష్మి స్మారక పురస్కార ప్రదానోత్సవంలో జస్టిస్ రాధారాణి



జస్టిస్ రాధారాణికి పురస్కారాన్ని అందజేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్, సత్యనారాయణ

ప్రజాశక్తి-తెనాలి

సామాజిక మాధ్యమాలతో కాలం వృథా చేసుకోకుండా సాధారణ జీవితాన్ని గడపటం బాల్యం నుంచి అలవరచుకోవాలని తెలంగాణా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గురిజాల రాధారాణి అన్నారు. స్థానిక కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో పట్టణానికి చెందిన మొవ్వా విజయలక్ష్మి స్మాకర సమితి వ్యవస్థాపకులు మొవ్వా సత్యనారాయణ అధ్యక్షతన శనివారం నిర్వహించిన విజయలక్ష్మి స్మారక సభలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వ్యాయామ ఉపాధ్యాయురాలిగా ఎంతో నిబద్ధతతో పనిచేసిన మొవ్వా విజయలక్ష్మి స్మారకంగా ప్రతి ఏటా పురస్కారాన్ని అందించటం ఆనవాయితీ. అదే విధంగా ఏడో వర్ధంతి సందర్భంగా నిర్వహించిన సభలో సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ద్వారా మొవ్వా విజయలక్ష్మి స్మారక పురస్కారాన్ని జస్టిస్ రాధారాణికి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా 'విద్యార్థులు-భవిష్యత్ సవాళ్లు' అంశంపై జస్టిస్ రాధారాణి మాట్లాడుతూ వినూత్న ఆలోచనా ధోరణికి చదువు నాంది పలకాలన్నారు. కేవలం మార్కులు, ఉద్యోగం కోసమే చదువు కాదని, మానసిక వికాసానికి దోహద పడాలని అన్నారు. బాలికలన్న భావనతో క్రీడలకు దూరంగా ఉండకూడదని, వారు కూడా చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో సమగ్రంగా రాణించాలని చెప్పారు. తల్లిదండ్రులకు విద్యార్థులు చేదోడుగా ఉంటే పరిస్థితులు అవగతం చేసుకునే వీలుంటుందన్నారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ జీవితంలో జయాపజయాలు సర్వసాధారణమని, వాటని బేరీజు వేసుకుంటూ దీర్ఘకాలిక లక్ష్యాలను సాధించాలని సూచించారు. పోటీపరీక్షలకు సిద్ధపడే విద్యార్థులు నిపుణుల సలహాలను పాటించాలన్నారు. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ మంచి చెడులను విశ్లేషించుకుంటూ నైతిక విలువలతో కూడిన విద్యనభ్యసిస్తే విద్యార్థులకు బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. అనంతరం జస్టిస్ రాధారాణి, శీలం గాంధీ దంపతులను సత్కరించారు. సభలో చైతన్య వేదిక అధ్యక్షులు డాక్టర్ పి.దక్షిణామూర్తి, రవాణా శాఖ మాజీ అడిషనల్ కమిషనర్ శీలం గాంధి, అమృతసాయి ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ కె.రామ్మోహనరావు ప్రసంగించారు. ఈ సందర్భంగా గత విద్యాసంవత్సరంలో తెనాలి మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో పాటు తెనాలి మండలంలోని జెడ్‌పి పాఠశాలల్లో పదో తరగతిలో 550కి పైబడి మార్కులు సాధించిన 26 మంది విద్యార్థులకు రూ.5 వేల చొప్పున నగదు, షీల్డులను అందించి అభినందించారు. న్యాయమూర్తి రాజశేఖర్, ఎఎస్ఎన్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.రాంచంద్, మహ్మద్ ఖుద్దూస్, జి.పూర్ణచంద్, కటకం ప్రసాద్, వెంకట్, సత్యనారాయణ పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

మానవత సంస్థ ఆధ్వర్యంలో చెస్ పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు

అంతర్జాతీయ చెస్ దినోత్సవం సందర్భంగా గుంటూరు ప్రభుత్వ మహిళా జూనియర్ కాలేజిలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో చెస్ పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందిన విద్యార్థులకు నగదు బహుమతి, ప్రశంసాపత్రాలు అందజేశారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, మురళీకృష్ణ, మనవతా ప్రెసిడెంట్ కొమ్మాలపాటి శ్రీనివాసరావు, సెక్రెటరీ సతీష్‌బాబు, ట్రెజరర్ టి.వి.సాయిరాం, గవర్నమెంట్ ఒకేషనల్ కాలేజి మాజీ ప్రిన్సిపాల్ సుధాకర్, బాలికల జూనియర్ కాలేజి ఎన్ఎస్ఎస్ విభాగం అధికారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ చెస్ ఆట ప్రాముఖ్యత గురించి వివరించారు. చెస్ ద్వారా మేధస్సు, జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు.



లోతట్టు ప్రాంతాల్లో టిడిపి నాయకుల పర్యటన

ప్రజాశక్తి-తాడేపల్లి : వర్షాల వల్ల బురదమయంగా మారిన నులకపేట, ప్రకాష్‌నగర్ ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాలను మున్సిపల్, రెవెన్యూ అధికారులతో టిడిపి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు శనివారం పర్యటించారు. ఇబ్బందులు పడుతున్న ప్రజల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్వారీలో ఇంటి గోడ కూలడంతో బాధిత కుటుంబాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించారు. ఆ కుటుంబానికి నిత్యాసవరాలతో పాటు ఆర్థిక సాయం అందజేసినట్లు చెప్పారు. అవసరమైన చోట అధికారులతో కలిసి పార్టీ నాయకులు, కార్యకర్తలు అండగా ఉండాలన్నారు.

తక్కువ ధరకే కందిపప్పు, బియ్యం

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్ : ప్రభుత్వం తక్కువ ధరలకు అందజేస్తున్న కందిపప్పు, బియ్యాన్ని ప్రజలు వినియోగించుకోవాలని తహశీల్దార్ లాజరస్ కోరారు. మండల కేంద్రమైన పెదనందిపాడులో విక్రయి కేంద్రాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. తుమ్మల శివనాగేశ్వరరావు కిరాణా స్టోర్‌లో నిర్వహిస్తున్న కేంద్రం ద్వారా కిలో కందిపప్పు రూ.160, కిలో సన్నబియ్యం రూ.49కు అందిస్తున్నట్లు చెప్పారు. ఒక్కొక్కరికి కిలో కందిపప్పు, 15 కిలోల బియ్యం ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో సివిల్ సప్లయీస్ డిటి పద్మజ, మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ, ఆర్ఐ యెహోషువ, సర్వేయర్ ప్రసాద్, వీఆర్వో సుధాకర్ పాల్గొన్నారు.

పిఎఎస్ కళాశాల అభివృద్ధికి విరాళం

ప్రజాశక్తి - పెదనందిపాడు : స్థానిక ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల అభివృద్ధికి పెదనందిపాడుకు చెందిన డాక్టర్ కొల్లా నాగేశ్వరరావు రూ.50 వేలను ఇందుకూరిపేటకు చెందిన జీవీఎల్ఎన్ ప్రసాద్ రూ.50 వేలు అందజేసినట్లు కళాశాల పాలకవర్గ అధ్యక్షులు విశ్రాంత విజిలెన్స్ ఎఎస్‌పి కాళహస్తి సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దాతలకు కళాశాల పాలకవర్గ సభ్యుల తోపాటు ప్రిన్సిపాల్ జి.వీరరాఘవయ్య, వైస్ ప్రిన్సిపాల్ ప్రతాప్ కుమార్, ఎన్‌సిసి అధికారి డాక్టర్ పాతూరి శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

నీటి అందాల ఎత్తిపోతల

ప్రజాశక్తి - విజయపురిసౌత్



మండలంలోని తాళ్లపల్లి సమీపంలోని పర్యాటక ప్రాంతమైన ఎత్తిపోతలకు వరద ప్రవాహం పెరిగింది.నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ఎత్తిపోతల జలకళను సంతరించుకుంది. ఎగువన వర్షాలు భారీగా పడుతుండటంతో వాగులు, అటవీ మార్గాల ద్వారా వరద నీరు ఎత్తిపోతలకు చేరుకుంటుంది. ఎత్తిపోతల 70 అడుగుల ఎత్తు నుంచి నీరు కిందకు ప్రవహిస్తూ పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది. జలపాతం అందాలను చూసేందుకు సందర్శకులు ఎత్తిపోతలకు తరలివస్తున్నారు.

పిల్లికి తల్లయిన శునకం

ప్రజాశక్తి - విజయపురిసౌత్



కుక్క, పిల్లికి ఉండే సాధారణ వైరం అందరికీ తెలిసిందే.. అయితే తన కడుపున పుట్టిన కుక్కపిల్లలు చనిపోవడంతో అదే ఇంట్లో పెరుగుతున్న పిల్లి పిల్లకు పాలిస్తూ ఓ శునకం మాతృత్వానికి నిదర్శనంగా నిలుస్తోంది. మాచర్ల మండలం కొత్తపల్లికి చెందిన రాపోలు నాగేశ్వరరావు కొంతకాలంగా కుక్కని పెంచుకుంటున్నారు. ఆ కుక్కకి ఇటీవల మూడు పిల్లలకు పుట్టినా ఆనారోగ్యంతో కొద్దిరోజులకే చనిపోయాయి. ఈ క్రమంలో మూడ్రోజుల కిందట నాగేశ్వరరావు తన షాపులో ఒక పిల్లి పిల్ల తిరుగుతుండడాన్ని గమనించిన ఇంటికి తీసుకొచ్చారు. పిల్లి కుక్కవద్దకెళ్లి పాలుతాగడం మొదటుపెట్టింది. అయినా కుక్క ఏమీ అనకుండా పాలిచ్చింది. అప్పటి నుండి అవి రెండు తల్లీపిల్లల్లాగా మెలుగుతున్నాయి. ఇది తెలిసిన స్థానికులు వాటిని ఆశ్చర్యంగా చూసి వెళ్తూ మురిసిపోతున్నారు.

వెంకటరత్నం మృతికి సిపిఎం సంతాపం

ప్రజాశక్తి-గుంటూరు

ప్రముఖ అభ్యుదయ కవి అడిగోపుల వెంకటరత్నం మృతికి సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు శనివారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. వెంకటరత్నం ఆచార్య నాగార్జునా యూనివర్సిటీలో ఇంజినీరింగ్ విభాగంలో ఉద్యోగం చేస్తూనే అనేక ప్రజా సమస్యలపై కవితలు రాసేవారని, సామాజిక చైతన్యంతో శ్రామికులను కదిలించే విధంగా ఉండేవని పేర్కొన్నారు. అనేక ఉద్యమాలకు అండదండలుగా ఉండేవారని గుర్తు చేశారు. ఆయన మృతి అభ్యుదయ ఉద్యమాలకు తీరని లోటని, వారికి నివాళు లర్పిస్తూ కుటుంబానికి సానుభూతిని తెలిపారు.

చిప్స్ కళాశాలకు ఐఎస్ఒ సర్టిఫికేషన్

ప్రజాశక్తి-గుంటూరు

చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కాలేజీకి ఇంటర్నేషనల్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్ (ఐఎస్ఒ) సంస్థ సర్టిఫికేషన్ జారీ చేసిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విద్యాధర శనివారం తెలిపారు. విద్యలో నాణ్యతా విలువలు పాటిస్తున్నందుకు గాను ఆడిట్ నిర్వహించి, ఐఎస్ఒ 21001:2018 ఎడ్యుకేషనల్ ఆర్గనైజేషన్ మేనేజ్‌మెంట్ సిస్టం ధ్రువీకరణ పత్రం అందచేసిందన్నారు. అంతేకాకుండా మరోక రెండు విభాగాలలోనూ ఈ ఆడిట్ నిర్వహించిందన్నారు. కళాశాల పరిసరాల్లో పర్యావరణ పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలకుగాను ఐఎస్ఒ 14001:2015 సర్టిఫికెట్, శక్తి ఖర్చులు తగ్గించటానికి చేపడుతున్న చర్యలకుగాను ఐఎస్ఒ 50001:2018 సర్టిఫికెట్ అందచేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బందికి అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ సిఎస్ శ్రీనివాస్, కోశాధికారి రాయపాటి గోపాలకృష్ణ అభినందించారు.



సర్టిఫికెట్ చూపిస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

పేటెంట్ ప్రాముఖ్యతపై చలపతిలో శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు

చలపతి ఫార్మసీ కాలేజిలో శనివారం పేటెంట్ ప్రాముఖ్యతపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్ విభాగం, ఐటిటిఎఎస్ ఫార్మా ప్రైవేటు లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన క్యాక్రమంలో ముఖ్య అతిథులుగా ఆచార్య నాగార్జునా యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ జర్నలిజం అండ్ మాస్‌కమ్యూనికేషన్స్ హెచ్‌ఒడి డాక్టర్ జి.అనిత, ఐపిఆర్ అటార్నీ ఎం.సుధీర్, ఐఎక్స్ఓఆర్ఎ టెక్ ప్రైవేటు లిమిటెడ్ డైరెక్టర్ నానన్‌దాస్ పాల్గొని ప్రసంగించారు. ఈ శిక్షణలో పేటెంట్‌కు సంబంధించిన వివిధ దశలైన ఫైలింగ్, పరిశ్రమలలో అనుసరిస్తున్న నూతన విధానాల గురించి అవగాహన కల్పించారు. ఒక వ్యక్తి తనకు సంబంధించిన ఆవిష్కరణలను ఇతరులకు విక్రయించటం, తయారు చేయటం, ఉపయోగించటం, దిగుమతి చేసుకోవటం వంటివి జరగకుండా చట్టపరమైన హక్కును తనకు సొంతం చేసే విధానాన్ని పేటెంట్ అంటారని వివరించారు. ప్రస్తుతం ఈ పేటెంట్ ప్రతి వాణిజ్య, వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుంటుందన్నారు. ఈ శిక్షణకు వివిధ కాలేజీల నుండి విద్యార్థులు హాజరవగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు, కో-ఆర్డినేటర్స్ వై.కౌషిక్, డాక్టర్ పి.వి.సురేష్, ఎం.శివప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ అనిత

ఆర్‌విఆర్ అధ్యాపకురాలు స్రవంతికి డాక్టరేట్



ప్రజాశక్తి-గుంటూరు : ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజినీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.స్రవంతికి అన్నామలై యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. స్రవంతి 'ఏరియల్ అండ్ యాక్యురేట్ స్పీచ్ వాయిస్ రిడక్షన్ విత్ డీప్ లెర్నింగ్ మోడల్' అంశంపై పరిశోధన చేశారు. అన్నామలై యూనివర్సిటీకి చెందిన డాక్టర్ ఎ.ఛార్లెస్, ఆర్‌విఆర్ అధ్యాపకులు డాక్టర్ టి.రంగబాబు స్రవంతికి గైడ్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా కళాశాలలో పిహెచ్‌డి కలిసిన స్టాఫ్ 141 మంది ఉన్నారని కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు. స్రవంతికి కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ అభినందనలు తెలిపారు.

నేడు వైతాళికుల చిత్రపటాల ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ

నగరంలోని బాలోత్సవ్ భవనం ప్రాంగణంలో ఆదివారం ఉదయం 10 గంటలకు వైతాళికుల చిత్ర పటాల ఆవిష్కరణ జరగనుంది. విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞానకేంద్రం (ఎంబివికె) వారు వైతాళికుల చిత్రపటాలను రూపొందించారు. వీటిని ప్రముఖ చిత్రకారులు గిరిధర్ ప్రత్యేక శ్రద్ధాసక్తులతో చిత్రించారు. మొత్తం 32 మంది పురోగమన సంస్కృతి వైతాళికుల చిత్రపటాలను బాలోత్సవ్ భవనం ప్రాంగణంలో శాశ్వత ప్రతిపాదికన అమర్చి ఆవిష్కరించనున్నారు. ఈ సందర్భంగా జరిగే సభలో సామాజిక, సాహిత్య విశ్లేషకులు తెలకపల్లి రవి, కథా నవలా రచయిత డాక్టర్ కెఎన్ మల్లీశ్వరి, ఎస్ఎస్ఆర్ జగన్నాథరావు (క్రియ), బాలాంత్రపు ప్రసూన, అనిల్ డ్యానీ, సత్యాజీ, ఎస్.అనిల్ తదితరులు పాల్గొంటారు.

పల్నాడులో హింసాత్మక రాజకీయం

వీక్షణం

గత ప్రభుత్వంలో అనుసరించిన విధానాలనే తరువాత కాలంలో కూడా పాటించడం పోలీసులకు వెన్నతో పెట్టిన విద్యగా మారింది. వైసిపి ప్రభుత్వ హయాంలో జరిగిన రాజకీయ హత్యలన్నీ వ్యక్తిగత కక్షలతో జరిగినవేనని ఆనాటి పోలీసు అధికారులు ప్రకటించినట్టుగానే ప్రస్తుత పోలీసు అధికారులు కూడా ఇప్పుడు జరుగుతున్న ఘటనకు వ్యక్తిగత అంశాలను ప్రచారం చేసి శాంతిభద్రతల సమస్యలను మరుగుపడేలా చేస్తున్నారని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత బుధవారం రాత్రి వినుకొండలో ప్రజలంతా చూస్తుండగా వైసిపి కార్యకర్త రషీద్ హత్య ఘటన ఇందుకు ఉదాహరణగా నిలిచింది. హతుడు, హంతకుడికి మధ్య గతంలో వ్యక్తిగతంగా కొన్ని సంబంధాలున్నా అవి రాజకీయ కక్షలుగా మారవని చెప్పలేని పరిస్థితి ఉంది.

రాజకీయాల్లో ఆధిపత్యం కోసం ఒక పార్టీలో తమ ఉనికి తగ్గిపోయినప్పుడు మరో పార్టీలోకి వెళ్లి ప్రత్యర్థి పార్టీలోని కీలక వ్యక్తులను లక్ష్యం చేసుకుని హత్యలకు పాల్పడిన రాజకీయ ఘటనలు గతంలో అనేకం జరిగాయని వివిధ రాజకీయ పార్టీల నేతలు గుర్తు చేస్తున్నారు. వినుకొండ ఘటనను రాజకీయ కోణంలో చూసినా చూడకపోయినా ప్రభుత్వం దీనిని శాంతిభద్రతల సమస్యగా చూడాల్సిన అవసరం ఉందని మాత్రం చెప్పక తప్పదు. ఒక వ్యక్తిని మరొక వ్యక్తి అంత కసిగా, క్రూరంగా సమాజాన్ని భయభ్రాంతులకు గురిచేసేలా పాశవికంగా హతమారిస్తే దీనిని ఇద్దరు వ్యక్తుల మధ్య ఉన్న సాధారణ కక్షగా ఎలా పరిగణిస్తారన్న ప్రశ్న ఉత్పన్నం అవుతోంది. పల్నాడు జిల్లా ఎస్పిగా మల్లికా గర్గ్ ఉన్నప్పుడు మౌనంగా ఉన్న నేరస్తులు ఎస్పి మారగానే ఎలా పెట్రోగి పోయారని మాజీ ముఖ్యమంత్రి జగన్ ప్రశ్నించారు. ఇందుకు అధికారులు సమాధానం ఇచ్చుకోలేని స్థితిలో ఉన్నారు. అయితే వైసిపి హయాంలో జరిగిన రాజకీయ హత్యలు, దాడులు కూడా వ్యక్తిగతమేనని అప్పటి ఎస్పి రవిశంకర్‌రెడ్డి తోసిపుచ్చుతూ వచ్చారు. అప్పటి ఎస్పి చర్యలపై గత ఐదేళ్లుగా టిడిపి అనేక పోరాటాలు చేసింది. రాజకీయ ఆధిపత్యం కోసం వైసిపి టిడిపి వారిపై దాడి చేసినా వ్యక్తిగతం అంటూ రవిశంకర్‌రెడ్డి చేసిన తప్పిదమే ఇప్పటి అధికారులు చేస్తున్నారు. మాచర్ల పట్టణంలో 2022 డిసెంబరు 16న టిడిపి నాయకులపై జరిగిన దాడులు, ఇళ్లకు, కార్యాలయాలకు నిప్పంటించిన ఘటనలు కూడా అప్పట్లో వ్యక్తిగత కక్షలతో కూడిన వ్యవహారమేనని అప్పటి ఎస్పి రవిశంకర్‌రెడ్డి ప్రకటించడం కూడా వివాదస్పదంగానే మారింది. ఈ దాడుల్లో బాధితులను పరామర్శించేందుకు అప్పట్లో ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ వంటి నేతలను కూడా మాచర్లలోకి రానివ్వకుండా దాదాపు రెండు నెలల పాటు 144సెక్షన్ కొనసాగించారు. 2019 నుంచి 2024 మార్చి వరకు జరిగిన రాజకీయ హింసకు వ్యక్తిగత కారణాలనేని చెప్పి పోలీసులు చాలా ఘటనలను అత్యంత సులువుగా తీసుకున్న పరిస్థితులను ఆసరగా చేసుకుని ఇప్పుడు టిడిపి వారు కూడా ప్రతికారం తీర్చుకునేందుకు అప్పటి యంత్రాంగం అనుసరించిన పద్ధతులే కారణం అని సీనియర్ రాజకీయ నేతలు అభిప్రాయపడుతున్నారు.

2019 నుంచి 2024 వరకు వైసిపి హయంలో రాజకీయంగా, వ్యక్తిగతంగా ఇబ్బంది పడ్డ టిడిపి వర్గీయులు ప్రస్తుతం గుంభనంగా ఉన్నారు. గత రెండునెలలుగా ఎస్పి మల్లికా గర్గ్ తీసుకున్న కఠిన చర్యలతో చాలా మంది టిడిపి నేతలు వేచిచూసే ధోరణిలో వ్యవహరిస్తున్నారు. తమ వల్ల ఇబ్బంది పడ్డ వారు తమపై ప్రతీకారం తీర్చుకుంటారని తెలిసి ఇప్పటికే చాలా మంది వైసిపి నాయకులు, కార్యకర్తలు గ్రామాలు విడిచి వెళ్లిపోయారు. 2019 నుంచి 2023 వరకు కూడా వైసిపి హయంలో టిడిపి వారు కూడా ఇలాగే గ్రామాలను విడిచి వెళ్లిన ఘటనలు ఉన్నాయి. దుర్గి మండలం ఆత్మకూరులో వందలాదిమంది గ్రామం విడిచి వెళ్లిన పరిస్థితులపై తీవ్రంగా స్పందించిన టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు చలో ఆత్మకూరుకు పిలుపునిచ్చారు. టిడిపి కార్యకర్తల పరామర్శకు వెళ్తానని చంద్రబాబు చెప్పినా ఇందుకు అప్పటి వైసిపి ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. 2000 జనవరిలో ఆత్మకూరుకు అనుమతి ఇవ్వకపోవడంతో మూడ్రోజుల పాటు గుంటూరులోనే బస చేసి చంద్రబాబు తిరిగి తన నివాసానికి వెళ్లిపోయారు. అప్పట్లో పలు మార్లు చంద్రబాబు నాయుడు పల్నాడు పర్యటనకు వైసిపి ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదని కానీ తాము శుక్రవారం జగన్ వినుకొండ పర్యటనకు అనుమతి ఇచ్చారని టిడిపి నాయకులు గుర్తు చేస్తున్నారు.

(ఎ.వి.డి.శర్మ)



జ్ఞాపికలు అందజేస్తున్న డాక్టర్ విజయ

న్యూరోకాన్ వార్షిక సదస్సు ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

ఏపి న్యూరోకాన్-2024 గుంటూరులో 31వ వార్షిక సదస్సు శ్రీ కన్వెన్షన్‌లో శనివారం ప్రారంభమైంది. సదస్సుకు దేశంలోని ప్రముఖ్య న్యూరాలజిస్టులు, న్యూరో సర్జన్లు వచ్చి వారి రంగాల్లో అభిప్రాయాలు తెలిపారు. ఢిల్లీ నుండి పాల్గొన్న డాక్టర్ వై.వి.విష్ణు మాట్లాడుతూ ఇన్‌ఫ్లమేటరీ మయోపతి అనే కండరాల సమస్యపై కొత్తగా అందుబాటులోకి వచ్చిన చికిత్స గురించి వివరించారు. చెన్నై ఎస్ఆర్ఎంసి నుండి వచ్చిన ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ లక్ష్మీ నరసింహన్ అల్జిమర్స్ డిమెన్షియ వంటి వ్యాధులకు మోనోక్లోనల్ యాంటీబాడీస్ అనే కొత్త రకం వైద్య విధానం గురించి తెలిపారు. విశాఖపట్నం నుండి డాక్టర్ ఎస్.గోపి మాట్లాడుతూ బ్రైన్‌కు సంబంధించిన కొత్తరకం వైరల్ ఇన్‌ఫెక్షన్లు కరోనానే కాకుండా నిపా వంటి వైరల్ ఇన్ఫెక్షన్, వాటి నివారణ గురించి తెలియజేశారు. హైదరాబాద్ రెయిన్‌బో హాస్పిటల్ వైద్యులు డాక్టర్ లోకేష్ లింగప్ప మాట్లాడుతూ ఆటిసమ్ స్పెక్ట్రమ్ డిజార్డర్ అనే చిన్న పిల్లలలో చూసే జబ్బుల గురిచి మాట్లాడుతూ నాయనమ్మ, తాతయ్య వద్ద పెరిగే పిల్లలకు, ఇతర కేర్‌టేకర్స్ వద్ద పెరిగే పిల్లలకు భాషా ఉచ్చారణ దోషాలు ఉంటాయని చెప్పారు. టీవీలు, మొబైల్ ఫోన్‌లు ఎక్కువగా చూడటం వల్ల రుగ్మతలు సంభవిస్తాయని అన్నారు. పూణే నుంచి డాక్టర్ ఎస్పి గోర్తి ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ మెషిన్ లెర్నింగ్ ద్వారా పక్షవాతం లాంటి ఇతర నరాల జబ్బుల గురించి మెరుగైన వైద్యం అందగలిగేలా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఎలా ఉపయోపగడతాయో వివరించారు. ఈ సందర్భంగా జరిగిన వర్క్‌షాప్‌లో ముంబాయిలోని కెమ్ హాస్పిటల్ నుండి డాక్టర్ అభిదాషా మాట్లాడారు.